ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
18 సెప్టెంబర్, 2011

సిబిఐ

ఏ కేసైనా సై

హ్యాపీ బర్త్‌డే

(2011 సెప్టెంబర్ 18 నుంచి 2011 సెప్టెంబర్ 24 వరకు)

బి.వర్షశ్రీ
6సం॥, సెప్టెంబర్-20
ధనలక్ష్మి-రమేష్
మునిగలవీడు-వరంగల్

బి.వర్షిణి
3సం॥, సెప్టెంబర్-20
మాధవి-పద్మరాజు
శ్రీనివాసపురం-నల్లగొండ

ఎస్. దీప్తి
7సం॥, సెప్టెంబర్-19
పావని-శ్రీనివాసరాజు
మునిగేపల్లి-ఖమ్మం

డి.శ్రీ సిద్దార్థ
1సం॥, సెప్టెంబర్-21
పావని-శ్రీనివాసరావు
పెదనందిపాడు-గుంటూరు

కె. అభిలాష్
3సం॥, సెప్టెంబర్-20
రాణి-యాదగిరి
దౌల్తాబాద్-మెదక్

కె. చంద్రహాసిని
4సం॥, సెప్టెంబర్-18
కవిత-సుధాకర్
సీతారామనగర్-కర్నూలు

ఎ.లోకేష్
5సం॥, సెప్టెంబర్-24
లక్ష్మి-ఆంజనేయులు
ఒంగోలు-ప్రకాశం

జి. అనన్య
సెప్టెంబర్
బిందు-శేఖర్
తిలక్‌రోడ్డు-హైదరాబాద్

నిక్షిత
1సం॥, సెప్టెంబర్-2010
సునీత-రవి
నిజాంపేట-ఖమ్మం

వై. మనోజ్(సన్నీ)
4సం॥, సెప్టెంబర్-2007
ఎస్తేరురాణి-గురుకుమార్
మార్కాపురం-ప్రకాశం

ఎ. సుప్రజ
8సం॥, సెప్టెంబర్-2003
యశోద-వెంకటస్వామి
గద్వాల్-మ॥నగర్

ఎం. ప్రతీష్
6సం॥, సెప్టెంబర్-19
జయబాల-లక్ష్మీనారాయణ
గుంటూరు



వి.రోహిత్ చౌదరి
సెప్టెంబర్
కళ్యాణి-రాజశేఖర్
రణస్థలం-శ్రీకాకుళం

కె.అజయ్ చారి
7సం॥, సెప్టెంబర్-24
రాణి-యాదగిరి
దౌల్తాబాద్-మెదక్

మనలో మాట

జీవితం - వేగం



'నిదానమే ప్రధానం' అన్నది ఒకప్పటి నినాదమై కూర్చుంది. అదే అప్పటి జీవన విధానం కూడా! 'పరుగెత్తి పాలు తాగటం కన్నా నిలబడి నీళ్లు తాగటం మేలు' అనేవాళ్లు పెద్దలు. ఆ సంగతి బాగా అర్థం కావాలని చిన్నప్పడే- 'తాబేలు - కుందేలు : పరుగుపందెం' కథ చెప్పేవాళ్లు. కానీ, ఇప్పుడు ట్రెండు మారింది. అంతా పరుగే పరుగు. 'పరుగెత్తనివాడు పనికిమాలినవాడు' అన్నది ఇప్పటి భావన. బిడ్డ పుట్టకముందే స్కూలు అడ్మిషను కోసం పరుగు.. 'ఒకటి' నుంచి చదవడం అనేది ఎప్పడో పాతబడిపోయింది. కేజీలకొద్దీ పుస్తకాలు మోసే, చదివే శిక్షణ కోసం కేజీ స్థాయి చదువులు మొదలయ్యాయి. మళ్లీ కేజీలు ఈజీగా చదవటం కోసం ప్రీ కేజీలు ప్రారంభమయ్యాయి. అది మొదలు, సీట్లకోసం, ర్యాంకుల కోసం సాగే పరుగూ, పోటాపోటీ ఇంతా అంతా కాదు. చదివే పిల్లలున్న ప్రతి ఇల్లూ ఇప్పుడొక రణరంగం, పరుగుల క్షేత్రం ..!!

పిల్లలు కాలక్షేపం కోసం టీవీ ముందు కూర్చుంటే- టామ్ అండ్ జెర్రీ తెర నిండా పరుగులు తీస్తూనే ఉంటాయి. ఇక సూపర్‌మేన్లూ, స్పైడర్ మేన్ల పరుగూ, వేగాల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వీడియో గేముల్లో కార్లూ బైకులూ ఎంత వేగంగా పరుగెడితే అంత క్రేజు! పిల్లలు ఆ గేముల్లో విపరీత వేగంతో దూసుకుపోతుంటే- పెద్దలం కూడా తెగ సంబరపడిపోతాం. 'వెనక నుంచి వచ్చేస్తున్నాడు... వెళ్లు వెళ్లు..' అని తొందరపెడతాం. పిల్లలు నరాల తెగే ఉత్కంఠను, వేగంగా దూసుకుపోవాలన్న కసిని అనుభవిస్తూ ... బైకును ముందుకు ఉరికిస్తారు.. మధ్యలో మనుషులు అడ్డొచ్చినా, రాళ్లూ రప్పలూ తారసపడ్డా డోంట్‌కేర్ ! వేగమే వేదం... గెలుపే లక్ష్యం ...'వేగం లేని జీవితం శుద్ధ వేస్టు' అన్న ఫిలాసఫీ నరనరాన జీర్ణించుకుపోతుంది. వీడియో బొమ్మల స్థానే నిజం బైకులు చేతికొచ్చాక కూడా అదే వేగమూ, అదే ధోరణీ కొనసాగుతుంది. కంప్యూటర్లో ప్రమాదం జరిగితే- లేచి చేతులు దులుపుకొని మళ్లీ ముందుకు ఉరకవచ్చు. అయ్యో ... జీవితం అలా కాదే ..!!!

'వేగం' అనేది జీవితాన్ని సుఖమయం చేసిందనటంలో సందేహం లేదు. వేగం పెరగటంవల్ల ప్రయాణ దూరాలూ, భారాలూ భారీగా తగ్గాయి. 'కాశీకి వెళ్లినవాడు కాటికి వెళ్లినవాడితో సమానం' అన్న సామెత చెల్లకుండా పోయింది. ఒకేరోజు హైదరాబాదులో టిఫెనూ, లండన్లో లంచ్, వాషింగ్టన్ డిసిలో డిన్నరూ చేసే అవకాశం ప్రయాణ వేగంవల్లే సాధ్యమవుతోంది. అయితే, వేగం జీవితాన్ని సుఖవంతం, సౌకర్యవంతం చేయాలి తప్ప అధోగతికి ఈడ్చకూడదు. విషాదానికి హేతువు కాకూడదు. అందుకనే- 'అతి వేగం' ఒకటే జీవితం అనుకుంటున్న ఈ తరానికి మళ్లీ 'నిదానం' గురించి బోధించాలి. 'జీవితం' అనేది పరుగు కన్నా, అమిత వేగం కన్నా గొప్పది అని చెప్పాలి!

★

ఈ సంచికలో....

టపా	...	2
ఎవరిగోల వారిది	...	3
కవిత్వమ్	...	4
సినిమా కబుర్లు	...	8
నవ్వుల్ పువ్వుల్	...	13
అట్టమీది కథ	...	14
చిన్నకథ	...	18
వికాసం	...	19
కొత్తపుస్తకాలు	...	20
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

కథ ... 6

మూడోసారి....

ఈ పేజీ ... 10

సంగీత సాగరం
ఒకింత జాగ్రత్త సుమీ...



చూద్దామా ... 12

వైతిరి వృక్షగృహాలు

రుచి ... 21

పెసర లడ్డూలు



విలువైన సమాచారం

అట్టమీది కథ 'రేటు కోసమే రేటింగ్స్' ఎంతో విలువైన సమాచారం అందించింది. 'ఆరోగ్యం' శీర్షికలో ఔషధాల రేట్లు పట్టిక రూపంలో ఇవ్వడం వల్ల రేట్లు ఎంతగా పెరిగాయో తేలికగా తెలిసిపోతోంది. 'ముదిరిన మేడిన్ చైనా పిచ్చి'లో బ్రాందీ కేంద్రంగా మారిన హజారే దీక్షా స్థలం వార్త ఆశ్చర్యపరిచింది. 'అద్దంలా...' చిత్రాలు మురిపించాయి. 'మేఘాల ముచ్చట్లు' విజ్ఞానదాయకంగా ఉన్నాయి. 'ఆగనికాలం' కవిత స్ఫూర్తిదాయకంగా ఉంది. 'నడిరేయి నడక' బాగుంది. 'సినిమా కబుర్ల'లో హాలీవుడ్ వైఖరిని ప్రస్తుతించారు. 'ఒక్క డాలర్ జీతగాడు' వ్యాసం చదివి ఆశ్చర్యపోయాం. 'అజంతా గుహలు' చూడాలనిపించేలా ఉన్నాయి. 'మాటలకోట' సరదాగా సాగిపోతోంది. 'మనలో మాట'లో చెప్పినట్లు అవలక్షణాలన్నింటినీ రికార్డు చేసి ప్రజాహక్కుల ఉల్లంఘన కింద ప్రశ్నించే యంత్రాంగం రావాలని ఆశిద్దాం.

నేమాన సుభాష్ చంద్రబోస్, శ్రీకాకుళం.

గుండె గుభేలే...

చివరి పేజీలో 'విచిత్ర ప్రాణులు' వింత గొలుపుతున్నాయి. సభామర్యాదలను పోగొడుతున్న నాయకులను పది సంవత్సరాల పాటు ఎన్నికల నుండి బహిష్కరించాలి. హాలీవుడ్ 'సినిమా కబుర్లు' బాగున్నాయి. 'చూద్దామా'లో అజంతా సమాచారం బాగుంది. రోగం రావడం కన్నా దానికి మందులు కొనడానికెళ్తే గుండె గుభేలుమంటోంది. 'మేడిన్ చైనా పిచ్చి' నషాళానికంటింది. 'బాలనేస్తాలు'లో పక్షి కథ బాగుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

అమ్మో!

ఆన్‌లైన్ సినిమాలా?

బౌద్ధమత విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఎల్లోరా గుహలు బాగున్నాయి. గతం గురుతులు, అట్టమీద కథ ఎంతో విలువైన సమాచారం అందించాయి. టీవీలో వచ్చే సినిమాలతోనే తల బొప్పి కడుతుంటే ఆన్‌లైన్ సినిమాలు ఏంటండీ?

వి.ఆర్.సి.హెచ్, నెల్లూరు.

వాస్తవానికి దగ్గరగా...

'మనలో మాట'లో హక్కుల ఉల్లంఘన వాస్తవానికి అద్దం పట్టింది. చట్ట సభలు, పార్లమెంటు, అసెంబ్లీల్లో సభ్యుల తీరు దశాబ్దాల తరబడి చూస్తున్నదే. కొన్ని అంశాలపైన అసలు చర్చే జరగదు. మరికొన్నింటిపైన అరుపులు, కేకలు, చిన్న సైజు ముష్టి యుద్ధాలు. అలాంటి వారిపై సస్పెన్షన్ వేటు తప్ప సరైన శిక్ష లేదు. దొడ్డి దోవన బిల్లులు ఆమోదం చేయించుకుంటారు. ఇక అవి ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటే అన్నట్లుంది.

టి. శ్రీరామమూర్తి, విశాఖ.

విచారకరం

గతవారం స్నేహలో ప్రచురించిన 'పాపల పీక నులిమే పవిత్ర భూమి' వ్యాసం విజ్ఞాన దాయకంగా ఉంది. భారతదేశం గురించి గొప్పగా చెప్పుకునే మన జాతిలో లింగ వివక్ష, గర్భస్రావాలు చేసే హీన సంస్కృతి వ్యాపించడం గర్హనీయం. మానవత్వానికి సమాధి కట్టే దిశలో సమాజం పయనిస్తోంది. ఇటువంటి దురాచారాన్ని అరికట్టాలి. రచయితకు అభినందనలు. పాఠకులు భద్రపరుచుకోవాల్సిన వ్యాసాల్లో ఇదొకటి.

అన్నెపు పాపారావు, శ్రీకాకుళం.

వింత వాస్తవాలు

ఓ పక్క వానాకాలపు రోగాలతో ప్రజలు బాధపడుతుంటే,



మరోపక్క ఆర్థిక ఉబ్బస రోగంతో నాయకులు అవస్థపడుతున్నారు. వీటికి సరైన తీర్పు ఇవ్వలేక ప్రభుత్వం మంచం పట్టింది. 'మనలోమాట' రూపంలో వాస్తవాలు చెప్తున్నారు. ప్రపంచ వీక్షణం రాసే కోటేశ్వరరావు వింతలతో కూడిన వాస్తవాలు రాసి ఆనందింపజేస్తున్నారు. ప్రపంచమంతా తమ దేశాలను ఫాదర్ లాండ్ అని చెప్పుకుంటారు. మనం మాత్రమే 'మాతృదేశం' అని పిలుచుకుంటాం. అలాగే నదులనూ స్త్రీల పేరుతో గౌరవిస్తాం. అలాంటి దేశంలో ఆడశిశువును కడుపులోనే చంపుకునే స్థితికి దిగజారాం. ఇందుకు కారణాలను దేవి చక్కగా వివరించారు. అంతే కాదు చట్టానికి దొరక్కుండా వీర్యకణాలను వడపోసి మరీ ఆడశిశువు జన్మించకుండా అడ్డుకునే కొత్తపద్ధతిని కనుగొనడం ఇంకా దురదృష్టకరం.

ఇలిపిల్ల సూర్యనారాయణ, విజయవాడ.





ఎవరి గోల వారిదే

శతకోటి దరిద్రాలు... తస్మాత్ జాగ్రత్త



శతకోటి దరిద్రాలను దాటేందుకు అనంత కోటి ఉపాయాలు అన్నట్లు మోసగాళ్లకు ఉపాయాలకు కొరత లేదీరోజుల్లో. విదేశీ వ్యాపారంలో నష్టం వచ్చిన కారణంగా ఎగుమతి సరకును అయినకాడికి అమ్ముకొనేందుకు క్లియరెన్స్ సేల్స్ వెయ్యి రూపాయల చీర వందకే అని ఒకరు. కుటుంబ తగాదాల కారణంగా షాపును ఎత్తివేస్తున్న సందర్భంగా మూడువేల రూపాయల డ్రస్సు వందకే అని మరొకడు, కరాచీలో అల్లర్ల కారణంగా నిలిచిపోయిన ఎగుమతులను సొమ్ము చేసుకొనేందుకు భారీ డిస్కౌంట్ సేల్ అని మరొకడూ రకరకాల పేర్లతో మనల్ని మోసం చేయటానికి ప్రయత్నించిన, ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు చాలా మందికి కంప్యూటర్లు, ఇ మెయిల్ ఐడీలు వచ్చిన తరువాత కొత్త రకం మోసగాళ్లు జనాల్ని బుట్టలో వేస్తున్నారు. ప్రపంచంలో ఏ దేశంలో పరిస్థితులు బాగోలేకపోయినా ఆ పేరుతో బురిడీ కొట్టిస్తున్నారు. ఇప్పుడు లిబియా మోసం నడుస్తోంది. మచ్చుకు ఎలా ఉంటాయో చూడండి. 'ఇంటర్నెట్ ద్వారా మీ పరిచయం కలిగింది. ఇప్పటికే మీకు అనేక తప్పుడు మెయిళ్లు వచ్చి ఉంటాయి. అయితే మీకు తెలిసే ఉంటుంది. లిబియా గురించి టీవీలు, పత్రికల్లో చూసే ఉంటారు. గడాఫీని సమర్థించేందుకు నిరాకరించిన టాప్ మిలిటరీ ఆఫీసర్లలో మానాన్న ఒకరు. ఆయనను చంపివేశారు. మేము పక్కనే ఉన్న బెనిన్‌కు పారిపోయాము. చనిపోక ముందు మానాన్న బెనిన్‌లోనే 11.5మిలియన్ డాలర్లు డిపాజిట్ చేసినట్లు చెప్పాడు. ఆ పత్రాలు మా వద్ద ఉన్నాయి. మీ సలహామేరకు మీ దేశంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నాం. మీరు సాయం చేయగలరా వెంటనే తెలపండి."

"మీరు మీ కుటుంబం క్షేమం అని తలుస్తున్నాము. మా కంటే దేవుడికే మీ గురించి ఎక్కువగా తెలుసు. ఆయనే నన్నీ పనికి పురమాయించాడు. ఈ మెయిల్‌లో ఉన్న అంశాలు మీ నైతిక నియమావళికి విరుద్ధమైతే క్షమించండి. మీ వ్యక్తిగత జీవితంలో కూడా సమస్యలు రావచ్చు. అయినా రహస్యంగా ఉంచండి. నేను బుర్కినా ఫాసోలోని ఆఫ్రికా బ్యాంకులో చీఫ్ ఆడిటర్‌గా పనిచేస్తున్నాను. మా ఖాతాదారు కుటుంబం ఒకటి విమాన ప్రమాదంలో అందరూ మరణించారు. కావాలంటే మీరు ఆ వార్తను బిబిసి నెట్‌లో http://newswww.bbc.net.uk/2/hi/uk_news చూడగలరు. ఆ ఖాతాలో 27 మిలియన్ డాలర్లు ఉన్నాయి. ఐదు సంవత్సరాల తరువాత ఎవరూ ఆ సొమ్ము మాదంటూ క్లెయిము చేయకపోతే ఆ సొమ్మును ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. అయితే నేను మిమ్మల్ని ఆ సొమ్ముకు వారసుడైన విదేశీయుడిగా పరిచయం చేస్తాను. ఆ సొమ్ము అవినీతి ప్రభుత్వ ఖాతాకు వెళ్లటం నాకు ఇష్టం లేదు. ఒక విదేశీయునిగా మీకు ఆ సొమ్ములో 40శాతం బదిలీ చేయవచ్చు,నాకు 55శాతం మిగిలిన ఐదుశాతం మొత్తాన్ని ఇతర ఖర్చులకు ఉపయోగించే విధంగా పంచుకుందాం. బ్యాంక్ చీఫ్ ఆడిటర్‌గా ఉన్నందున ఇతరులతో ఎలాంటి సమస్య ఉండదు. కావాలంటే మన పంపకాల గురించి ఒక రిజిస్టర్డ్ ఒప్పంద పత్రం రాసుకుందాం. అంతా చట్ట ప్రకారమే చేద్దాం."

ఇలాంటి మెయిల్స్ అన్నింటిలో చివరన మీ వివరాలు ఇవ్వమని అడుగుతారు. ఒకసారి ఇచ్చారో మిమ్మల్ని బుట్టలో వేసి మాయమాటలు చెప్పి మీ నుంచి డబ్బు గుంజుతారు. విజయవాడ యూరో లాటరీ మోసం గురించి తెలుసుకదా ఇవి కూడా అవే. ఇక సెల్‌ఫోన్లలో వచ్చే గిఫ్ట్ ఎస్సెమ్మెస్‌ల సంగతి చెప్పేదేముంది! మీరు ముత్యాల సెట్టు గెల్చుకున్నారో, అంత విలువ చేసే ప్రైజ్ పొందారనో మెసేజ్‌లు వచ్చేస్తుంటాయి. పొర్ర....పాటున వాటికి స్పందించామో ఇంతే సంగతులు!

ఏది అరాచకం, ఏది చట్టబద్ధ పాలన ?

ఏది అరాచకం, ఏది చట్టబద్ద పాలన 'ఓ మహాత్మా, మహర్షీ' అంటే బెల్జియం వాసులు చెప్పటం కష్టమే. మార్చి 31లోగా బడ్జెట్ ఆమోదం పొందక పోతే ! అమ్మో ఇంకేముంది !! ట్రెజరీ నుంచి ఒక్క పైసా కూడా తీసుకోవటానికి వీలుకాదు. అసలు ప్రభుత్వమే లేకపోతే !!! వంకాయ్, ఎక్కడా ఏమీ కాదు, నిజానికి అదే బాగుంది, ప్రభుత్వాలున్న చోట 'పొడుస్తున్నదేమిటో' చెప్పండి అంటున్నారట బెల్జియం వాసులు. నిజమే కదా అసలు బడ్జెట్‌లు, ఆమోదం పొందటాలు లేని రోజుల్లోనే కదా మన పూర్వీకులు 'బతికి బట్టకట్టింది'. బెల్జియంలో గడిచిన 67 సంవత్సరాల్లో 45 ప్రభుత్వాలు ఏర్పడితే గతేడాది జూన్ 13న ఎన్నికలు జరిగిన తరువాత అప్పటి నుంచి ఈ రోజువరకు అక్కడ ఏకంగా 465 రోజులుగా 'ప్రభుత్వమే లేకుండా' ప్రపంచ రికార్డు నమోదైంది. 'ప్రభుత్వం ఉన్నా పాలనలేని' మన రాష్ట్రం కూడా ఎప్పుడైనా రికార్డులకు ఎక్కవచ్చేమో ! ఏమో?

తాత్కాలిక ప్రభుత్వాలు తప్ప ఎన్నికైన అసలు ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడుతుందో, ఎవరూ ముందుకు రాని స్థితి. ఈ రోజుల్లో కూడా అలాంటి పార్టీలు ఉంటాయా? ఉండక చస్తాయా? సంక్షోభం అలాంటిది మరి !! ఎన్నికలు జరిగిన నాటి నుంచి 'అధికార లక్ష్మీకోసం కనీసం పదిమంది బెల్జియన్లు 'విల్లునెక్కుపెట్టేందుకు' ప్రయత్నించి విఫలమయ్యారు. ఐరోపా యూనియన్ ప్రధాన కార్యాలయం ఉన్న బ్రసెల్స్ బెల్జియం నగరమే. డచ్, ఫ్రెంచి భాష మాట్లాడే పౌరుల మధ్య తలెత్తిన వైరుధ్యంతో ఏ పార్టీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ రాలేదు. ఒకరినొకరు బలపరిచే అవకాశం లేదు గనుక నూతన ప్రభుత్వం ఏర్పడ లేదు. అక్కడి నగరాలు స్వయం పాలిత స్థానిక ప్రభుత్వాలను కలిగి ఉండటంతో జనానికి కూడా సేవల సమస్య తలెత్తటం లేదు. ఫ్రాన్స్‌లో ఈ ఏడాది రెండవ త్రైమాసికంలో 0.0, జర్మనీలో 0.1, బ్రిటన్‌లో 0.2 శాతం అభివృద్ధి నమోదు కాగా బెల్జియంలో 0.7శాతం ఉంది. ప్రభుత్వాలున్న దేశాలు సాధించిందేమిటట అన్న బెల్జియన్ల ప్రశ్నలకు ఎవరు సమాధానం చెబుతారు? అమెరికా, దాని మిత్రపక్షాల దాడుల కారణంగా ఇరాక్‌లో 250 రోజుల పాటు ప్రభుత్వం లేకపోవటమే ఇంతకు ముందున్న రికార్డు. అది సరే బెల్జియంలో ప్రభుత్వం ఎవరూ ఏర్పాటు చేయకపోతే ఏం చేయాలంటే 2014 వరకు అంటే నాలుగు సంవత్సరాల ఎన్నికల గడువు వరకు ఇలాగే కొనసాగవచ్చుట. ఐరోపా యూనియన్ మిగతా దేశాల్లో అమలు జరుపుతున్న 'పొదుపు చర్యలు' తమ దేశంలో అమలు జరిపే వారే లేనందున అక్కడి జనం 'కడుపులో చల్ల కదలకుండా' ఉన్నారు.

- ఎం. కోటేశ్వరరావు

సామెత చెప్పినట్టు!

గంజిలో ఉప్పు లేదు
పాలలోకి పంచదార కావాలి!
పరీక్షకు ఫీజు లేదు
సెల్‌ఫోన్ లోకి
బ్యాలెన్స్ కావాలి

[illegible]
[illegible]
[illegible]
[illegible]

[illegible]
[illegible]
[illegible]
తప్పులాడితే
ప్రజా పథకాలు
కుంటుపడతాయి

కుప్ప పీకే దొంగ
పరిగ ఏరుకునే వాడిని
బెదిరించినట్లు!
లంచాలు తినే అధికారి
పించను తీసుకునేవారిని
పీడించినట్లు

[illegible]
[illegible]
[illegible]
[illegible]
పార్టీకి అప్రతిష్ఠ తేక

శంకులో పోస్తే తీర్థము
పెంకులో పోస్తే నీళ్లు!
టీవీ యాడ్‌లో కనిపిస్తే
వాస్తవమైనది
లేదంటే నాసిరకం

పెద్ద ఓడ మునగడానికి
చిన్న కన్నం చాలు!
దేశాభివృద్ధి
కుంటుపడడానికి



అవినీతి చాలు

వైద్యుడికి ఖర్చు పెట్టేకంటే
వంటవాడికి ఖర్చు పెడితే
మంచిది!

ఒబెసిటీ క్లినిక్‌కి వెళ్లే బదులు
మార్నింగ్ వాక్‌కి వెళితే
మంచిది

కార్యం అయ్యేదాకా
గాడిద కాళ్లయినా పట్టాలి!
ఎన్నికల్లో గెలిచేదాకా
ఎన్ని అబద్ధాలైనా చెప్పాలి

ఒక పుస్తకం
ఉన్నవాడి విషయంలో
అప్రమత్తంగా ఉండు!
ఒక మీడియా ప్రతినిధితో
జాగ్రత్తగా మసలుకో

ఆవలి గట్టు ఆవుకు
ఈవలి గట్టు పచ్చన!
ఆంధ్రప్రదేశ్ అభ్యర్థికి
ఆస్ట్రేలియా జోన్
అందమైనది

ఒళ్లు కాలిన వాడు
చుట్టను కూడా
భయపడుతూ ముట్టిస్తాడు!
లంచం తీసుకుంటూ
పట్టుబడ్డ అధికారి
జీతం తీసుకోడానికి
కూడా భయపడతాడు

గుడ్డి గేదెలలో
గూని గేదె మహాలక్ష్మి!
అవినీతిపరులలో
అతి తక్కువ
అవినీతిపరుడు
నాయకుడు

- సోమిశెట్టి వేణుగోపాల్

కవిత్వమ్

ఆషాఢమేఘం

పురిటి మంచంపై బాలింత
తదేకంగా చూస్తోంది
తన పేగు బంధాన్ని
రెప్పలు మూసిన కళ్లు!
బిగించిన పిడికిళ్లు!
పెదవులపై నుంచి అలవోకగా జారిపడే చిరునవ్వులు
పసికందు మొహం పారదర్శకం
తల్లిది
పురిటి నొప్పులతో పులకరించిన
పెద్దరికం
తమలపాకులతో పండిన
పెదవుల దొరతనం
బిడ్డ
సుతిమెత్తని పెదవులతో రొమ్ములను
అందుకున్న వేళ
ఎక్కడో పాల సముద్రం ఉప్పొంగింది
కడలి
అలల చెలియలి కట్ట దాటి వచ్చింది
పిల్లవాడు పొలమారి ఉక్కిరిబిక్కిరి
అవుతుంటే
సముద్రాన్ని
ఔపోసన పట్టియ్యాలని చూస్తోంది
అన్నప్రాసన నాడే
ఆవకాయ అంటే అదేనేమో!!

- తమ్మెర రాధిక

హైకూలు...



రోజుకు వేల మంది...
మానుకుంటున్నారు
మద్యం,
మరణంతో...

సీసా ఖాళీ
మత్తులో సోలి
జీవితం ఖాళీ...

తాగావా...
గడికో నైంటి..
ఫార్టీలోనే..
అవుతావు నైంటి...

కాళ్లతో కాదు...
కంటి రెప్పలతో..
పరిగెడతానంటడు..
మద్యం పిచ్చోడు.

కన్న కూతురినే..?
కామంగా చూస్తుంది
వాడిలోని మద్యం...

మాయదారి రోగాలు...
ఎయిడ్స్, క్యాన్సర్
తాగుబోతు తనం..

ఇంట్లో దొంగ

ఒంట్లో మద్యం
విలువైనవే పోతాయి..

దరిద్ర దేవత..
కేరాఫ్..
తాగుబోతు ఇల్లు..

సారాయి వ్యాపారం...
మూడు కోట్లు
ఆరు శవాలు...
ప్రతి నిమిషం...

మనస్సు రాయి ...
అందుకే బానిస
చేసుకుంది సారాయి..

రాజుల సొమ్ము...
రాళ్ల పాలు
శ్రమ జీవుల సొమ్ము
సారాయి పాలు...

భార్యా పిల్లలను...
కాల్లదన్నుకుంటుంది
మద్యం మత్తు...

- వెందుర్తి హరిసింహనాయుడు

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
0-97890 99589

హాలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

కథ

మూడోసారి...

మూడురోజులుగా ఒక్కటే వర్షం. వాగులు, వంకలు పొంగాయి. మట్టిరోడ్డుమీద నడుస్తున్నాను. ఓ కవర్లో బ్రాందీసీసా, మిరపకాయబజ్జీలు, వాటర్‌ప్యాకెట్లు కూడా తీసుకెళ్తున్నాను. జీవితం గురించి ఆలోచిస్తుంటే నవ్వొస్తోంది. చేరుకోవాల్సిన కొండలు అల్లంతదూరాన కన్పిస్తున్నాయి. ఇంకెంతసేపు... ఓ పావుగంటలో చేరతాను.

అంటే- ముప్పయ్ ఏళ్లపాటు పెంచిపోషించిన శరీరాన్ని చాలించడానికి మహా అయితే ఓ గంట సమయముంది. ఈసారి ఖచ్చితంగా ఆత్మహత్య చేసుకోవాలి. లోగడ రెండుసార్లు అనుకుని చేసుకోలేకపోయాను. ఆ పరిస్థితి ఇప్పుడు రాదు. రాకూడదని కోరుకుంటున్నాను.

కొండలు సమీపిస్తున్నాయి. ఆ మట్టిరోడ్డులో ఎవరూ నడవడం లేదు. అప్పుడప్పుడు ఆటోలు కన్పిస్తున్నాయి. చాలా నిశ్శబ్దంగా ఉందా ప్రదేశం. చల్లనిగాలులు వీస్తున్నాయి. కొండల పక్కనే రైలుపట్టాలు కన్పించాయి.

అబ్బ! నా చివరి మజిలీ ఈ రైలు పట్టాలమధ్య సాగుతోంది. వాటి అంచు వెండిలా మెరుస్తోంది. దానిమీద నా నెత్తురు రంగేస్తాను. అయితే దాన్ని చూసే అవకాశం నాకుండదు. ఇలా అనుకుంటుంటే నాకే నవ్వొస్తుంది.

'చచ్చిపోతామని ముందే తెలిస్తే చెమటలు పట్టిపోతాడు మనిషి. గుండె వేగం పెరుగుతుంది. మరి నాకలాంటివి లేవెందుకు? బతకాలనుకున్నవాడు చావంటే భయపడతాడు కానీ తనకేంటనుకుని, ఏటవాలు కొండచాటున గడ్డిలో కూర్చుని ఇష్టమైన వాటిని ముందు పెట్టుకుని తృప్తిగా చూశాను.

ప్లాస్టిక్‌గ్లాసులోకి బ్రాందీ వంపుకుని వాటర్‌ని కలిపి 'అయిపోయిందమ్మా వ్యసనమమ్మా! నేను తాగుబోతును కాను. నాకు రావాల్సిన ఉద్యోగం జస్ట్ మిస్సయింది. లేకుంటే తాగేవాడిని, కొన్ని వందల సీసాలు తాగేవాడిని. అటు తయారీదార్లకు, ఇటు సర్కారుకి, అధిక ధరకు పాడుకుని అమ్మినోడికి... అందరికీ నావల్ల లాభాలు వచ్చేవి' అనుకుంటూ ఓ గ్లాసు తాగాను.

రెండు ఉల్లిపాయముక్కలు నోట్లో వేసుకుని కసావిసా నమిలితే చాలా బాగుంది. ఏదేమైనా మందుకి, ఉల్లికి మంచి కాంబినేషన్ అని వాచీ చూశాను. టైం పన్నెండయింది.

ఊళ్లో ఏ మంచిపనికైనా బ్రహ్మాండమైన ముహూర్తం పెట్టే శాస్త్రిగారు గుర్తొచ్చారు.

'ఆత్మహత్య చేసుకుంటాను మంచి ముహూర్తంపెట్టమంటే ఎవరూ పెట్టరుగా. అందుకే ఒక పని చేయబోతున్నాను. మంచి ఘడియలు చెప్పమంటే మధ్యాహ్నం పన్నెండున్నర నుంచి ఒకగంట వరకు శుభఘడియలు. అప్పుడు ఏ పనిచేసినా విజయమే అని చెప్పి యాభైనోటు తీసుకున్నాడు. పాపం పంతులయ్యకు నే చచ్చాక తెలుస్తుంది ఎందుకు ముహూర్తం పెట్టించానో' అనుకుని పకపకా నవ్వాను.

సీసాలో మిగిలింది గ్లాసులోకి వంపుకుని నీళ్లు కలిపి ఈ సారి మిరపకాయబజ్జీలతో లాగించేశా. కళ్లు ఎర్రగా అయ్యాయి.

అక్కడ ఎండిన చెట్టుమీద కాకి ఇటువైపే చూస్తుంటే 'నేను నీకేమీ మిగల్చకుండా తినిపోను. ఇదిగో ఎంగిలి చేయని బజ్జీ' అని దానివైపుకు ఒక బజ్జీ విసిరాను. అది గాల్లోనే తన్నుకుని మరోచెట్టువైపుకు ఎగిరిపోయింది.

స్వార్థం. ప్రతిజీవిలోనూ స్వార్థం. దిక్కుమాలిన కాకి బజ్జీముక్క కోసం చూసింది. ఈ ముసురులో ఆహారం కోసం ఎక్కడని వెతుకుందని బజ్జీ ఇస్తే తన్నుకుపోయింది. చెట్టంత మనిషివి. ఎందుకురా చావడానికి సిద్ధపడ్డావని అడగలేదు. కాకులూ మనుషుల్లా తయారయ్యాయి. అయినా ఈసారి ఆత్మహత్య చేసుకోవాలి. ఈ పక్షులతో, మనుషులతో పడలేక ఛస్తున్నాను.

ఉద్యోగం రావడం గ్యారెంటీ. ఊరి ఎమ్మెల్యే సిఫార్సు ఉంటే మరింత వేగంగా ఆర్డర్సు రెడీ అవుతాయని ఎవరో చెబితే, తండ్రితో వెళ్లి చెప్పుకున్నందుకు, ఆ ఉద్యోగం రాజకీయాల మాటున దక్కలేదు. వేరెవరో తన్నుకుపోయారు. భవిష్యత్ డీలా పడిపోయింది. పర్వతమంత ఎత్తుకు ఆ రాజకీయాలు ఎదిగిపోయాయి. నాకు ఉద్యోగం రాకుండా చేసిన రాజకీయాలను మట్టుబెట్టలేను. ఎంతని చిన్నచిన్న పనులు, ఉద్యోగాలు చేయడం. అందుకే చచ్చిపోవాలనుకున్నాను. తొలి ప్రయత్నంలో ఆత్మహత్య చేసుకున్నా చావలేకపోయాను.

పురుగుల మందు తాగాను. నా ఖర్మ బతకాలని రాసుంది. ఆ పురుగులమందు కాస్తా ఎక్స్‌పైర్డు. నాలుగు వాంతులు, రెండ్రోజులు ఆసుపత్రిలో సెలైన్లతో గుండ్రాయిలా లేచి కూర్చున్నాను.

నచ్చిన అమ్మాయి. మనస్సునిండా ఆమే. అంతగా ప్రేమించాను. ఆమె కూడా నన్ను ఇష్టపడింది. ఇద్దరం పెళ్లి వరకు వెళ్లాం. నిరుద్యోగితో జీవితాంతం నరకమేనని చెప్పి, ఆమె తండ్రి ఎక్కువ కట్నంపోసి రైల్వేలో ఉద్యోగం చేసేవాడికి ముడెట్టేసాడు. ఆమె కూడా మెడ వంచి తాళి కట్టించుకుంది.

ఫోన్లోనే ఆమెను నాలుగు దులిపాను.

'నిన్నెలా నమ్మను. ఉద్యోగం



రానందున పురుగులమందు తాగావు. నీమీద నీకే నమ్మకం లేదు. నాకు తెలియక నీ ప్రేమలో పడ్డాను. నీ చావుతో నువ్వే ఆదుకుంటావని తర్వాత తెలిసింది. మరెలా నిన్ను నమ్మను. ఒకవేళ నీతో నేను వచ్చేస్తే ఇద్దరం రోడ్డుపాలయ్యేవాళ్లం. ఈ బాధలు పడలేమని నువ్వు ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటే నాగతేం కాను. ముందు నిన్ను నువ్వు నమ్ము. అప్పుడు నువ్వేదైనా సాధిస్తావని'.ఎంత పరుషంగా బదులిచ్చింది.

ఇలాంటిదాన్నా ప్రేమించాననుకుని రెండోసారి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను. విరాగిలా అయిపోయి తెల్లవారుజామున ఊరవతల కోనేట్లో దూకేశాను.

ఈత రానందున నీళ్లలో మునిగిపోయా. గంగాళంలా నోరు తెరుచుకుని అందినకాడికి నీళ్లు తాగేసి గుడ్లు తేలేశాను. చచ్చాననుకుని బిర్రబిగిసిపోయాను.

ఎవరు కోనేట్లో పడతారా. నీళ్లలోంచి బయటికి తీసేద్దామా అన్నట్టు అక్కడే ఒకడున్నట్టున్నాడు. వెంటనే దూకి నన్ను ఒడ్డున పడేశాడు. అప్పుడు మళ్లీ రెండ్రోజులు ఆసుపత్రిలో చికిత్స. అవకాశం దొరికింది కదా అని తల్లి, చిన్నమ్మలు అందరూ కలిసి 'నీకు అందమైన అమ్మాయితో పెళ్లిచేస్తాం. ప్రేమలు వద్దురా, ఈకాలం ప్రేమలు మంచివి కావురా' అని చెవుల తుప్పొదిలేలా నూరిపోశారు.

రెండుసార్లు ఆత్మహత్య చేసుకోవడం, తృటిలో తప్పిపోవడంతో ఊరంతా బతికున్న శవంలా చూస్తున్నారు. ఎవరూ మాట్లాడరు. ఏ ప్రయివేటు కంపెనీ ఉద్యోగం ఇవ్వడానికి సిద్ధంగా లేదు.

తన పుట్టింటివారు ఇచ్చిన రెండెకరాలు నాచేతిలో పెట్టి 'సేద్యం చేసుకోరా! నాన్న జీతం తోడవుతుంది. నీకు చావాల్సిన ఖర్మ ఏంటని' నిత్యం ధైర్యం చెబుతోంది అమ్మ.

సరేనని చెమటోడ్చి వ్యవసాయం చేశా. పంట చేతికంది వస్తుందనుకుంటే, వర్షాలకు ఏటొడ్డు భూమి కాస్తా ముంపుకు గురైంది. అక్షరాలా లక్ష రూపాయలు నష్టపోయాను. అందుకే మూడోసారి ఈ దురదృష్టపు బతుకును అంతం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చా. ఎట్టిపరిస్థితిల్లోనూ ఈసారి వాయిదా పడకూడదని నిర్జన ప్రదేశంలో, అన్ని ఏర్పాట్లూ పక్కాగా చేసుకుని వచ్చాను.

నా చావుకు మంచి ముహూర్తం పెట్టిన పంతులయ్యకు రుణపడతాను.

నాలాంటి చేతకాని, చేవలేని వాడికి జన్మనిచ్చి, పెంచి పోషించిన తల్లిదండ్రులకు రుణపడి ఉంటాను. ఏమీ చేయలేక, చావును వెతుక్కుంటూ పోతున్నందుకు వాళ్లని మన్నించమని మనసారా కోరుతున్నాను.

తనమీద తనకి నమ్మకం లేని మనిషి బతికున్న శవంతో సమానమని, కొద్దిపాటి పరిచయంతోనే కనిపెట్టిన నా మాజీప్రేయసిని మరోజన్మలోనైనా నమ్మిస్తాను. నా ఉద్యోగం మరొకడి చేతిలో పెట్టిన రాజకీయాన్ని సర్వనాశనం కావాలని శపిస్తున్నాను.

ఇక ఈభూమ్మీద నేనెవరికీ జవాబుదారిని కాదు. ఎంతోహాయిగా, మనసు తేలిక చేసుకుని జీవితాన్ని చాలించేందుకు సిద్ధపడుతున్నాను.

వాచీ చూసుకున్నా.

చావు ముహూర్తానికి కేవలం ఐదే నిముషాలు టైముంది.

లేచి నిలబడ్డాను.

నేలమీదున్న ఖాళీ బ్రాందీసీసాను చేతిలోకి తీసుకుని 'సారీరా! అందరికి అన్నీ చెప్పి నీకేమీ చెప్పలేదు. ఇప్పుడు చచ్చినా మరో ఇరవై ఏళ్లలో నిన్ను వెతుక్కుంటూ నీవైన్ షాపుకు వస్తాను. గుడ్‌బై! అని ముద్దు పెట్టుకుని కదిలా.

పట్టాలను సమీపించాను. అక్కడి పరిసరాలు నిర్జనంగా వున్నాయి.

నాచావుకు ఎవరూ అడ్డంకి కాలేరు.

'ఓ మృత్యువా! ఈసారి నన్ను చూసి పారిపోకుండా అన్నీ ఏర్పాట్లు చేసుకున్నాను. వచ్చి కబళించేయ్' అని పట్టాలమీద తలపెట్టి పడుకుని నింగిలోకి చూశా.

ముసురు పట్టిన ఆకాశంలోంచి వర్షపు తుంపరలు పడుతున్నాయి. గురి చూసికొట్టినట్టు కళ్లలో గుచ్చుకునేసరికి పక్కకు ఒరిగాను. ట్రైన్ వస్తున్న శబ్దం వినాలని చెవులు రిక్కించాను.

కానీ ట్రైన్ ఎంతకీ రాదే. భారంగా ఓ గంట గడిచింది.

ఎందుకలా? ఈవైపు ప్రతి పావుగంటకో ట్రైనో, గూడ్సో దూసుకుపోతుంది. మరి గంటయినా రాకపోవడమేంటి? వాటే హెల్?! ట్రైన్ జీవితకాలం లేటు అవడానికి నేనేమీ ప్రయాణీకుడ్ని కాదే!? విధివంచితుడను. 'నాచావు నేను ఛస్తానంటే చావనీయకుండా రైలు రావడానికి ఇంతలేటా! ఇండియన్ రైల్వేస్ ఎంత వరస్ట్ నేచర్‌తో ఉన్నాయి' అని పట్టాల మీద అలా పడుకునే కోపంతో ఊగిపోయాను.

మరో గంట గడిచింది. ఒక్క రైలూ రాలేదు.

పంతులు పెట్టిన ముహూర్తం గోవిందా. అయ్యయ్యో! ఈ భూమ్మీద ఎందుకూ పనికిరాని వాడిని నేనేనా? అందరూ మోసం చేస్తున్నారని చద్దామనుకుంటే... దానికీ ది గ్రేట్ రైల్వేస్ అడ్డంకిగా తయారయ్యాయా? అని చిర్రెత్తి లేచి కూర్చున్నాను.

సాయంత్రం వరకు ఒక్క ట్రైనూ రాలేదు. ఈలోగా మళ్లీ మేఘాలు కమ్ముకుని వర్షం మొదలయింది.

'మూడోసారీ ఫెయిల్. పక్కాప్లాన్‌తో వచ్చినా చావలేక పోయా. ఎక్కడా చిన్న పొరపాటు కూడా చేయలేదు. మరెందుకు ఫెయిల్ అయ్యాను? అసలు రైళ్లెందుకు తిరగడం లేదో తెలుసుకోవాలి' అని లేచేసరికి అల్లంత

దూరాన పట్టాలు చెక్‌చేసుకుంటూ సాగుతున్న గ్యాంగ్‌మేన్ కనిపించాడు. అతన్ని కలుసుకుని రైళ్లు ఎందుకు రావడంలేదని అడిగా. "వరదలొస్తే రైళ్లెక్కడొస్తాయి. వారం రోజులవరకు అంతే" చెప్పి ముందుకు సాగాడు.

బతకడానికి ఎవరెవరో అడ్డుపడుతున్నారు. అలాగే చావడానికి అలాంటి అడ్డంకులే ఎదురవుతున్నాయి. ఏం చేద్దాం?! మాజీ ప్రేమికురాలు చెప్పినట్టు నన్ను నేను నమ్మితేనే బతకగలను. నిజమే... బతకాలి. చావు దానంతట అది వచ్చేదాక చావకూడదు. దృఢచిత్తంతో ఇంటికి వెళ్లా. ఇంటిముందు రెవెన్యూ గుంపు ఉంది

"నీ రెండెకరాలకి సర్కారు నష్టపరిహారం ఇస్తోంది" అన్నారెవరో.

బతకాలనుకున్నానో లేదో చల్లని కబురు అందిందనుకుని గట్టిగా తల విదిలించాను.

- యర్నాగుల సుధాకరరావు

టాకీస్‌కు 80 ఏళ్లు
మారిపోయిన మన వినోదం

(గత సంచిక తరువాయి)

భారతీయ సినీ చరిత్రలో టాకీల ఆవిర్భావానికి ఓ విశిష్టత ఉంది. ఎందుకంటే, వస్తు, శిల్పాలు - రెంటిలోనూ ఘన వారసత్వం ఉన్న నాటక రంగ సంప్రదాయాలను వెండితెర మీదకు తెచ్చి, ఉద్వేగభరితమైన సరికొత్త వినోద సాధనంగా టాకీ నిలిచింది. అదే సమయంలో అప్పటి వరకు మూకీ చిత్రాలతో నిశ్శబ్దంగా మిగిలిన సినీ మాధ్యమంలోకి శబ్దం, సంగీతం - రెంటినీ ప్రవేశపెట్టింది. ఆ రకంగా జనాన్ని బాగా ఆకర్షించింది. తొలి భారతీయ టాకీ అరేబియన్ నైట్స్ కథల తరహా నాటకీయత నిండిన 'ఆలమ్ ఆరా'. పార్శీ రంగస్థలం మీద ప్రసిద్ధమైన నాటకానికి ఇది వెండితెర రూపం. అసలు ఈ చిత్ర నిర్మాణానికి దర్శక - నిర్మాత అర్దేషిర్ ఎం. ఇరానీని ప్రేరేపించిందేమిటి? మూకీల రోజుల నుంచి చిత్రాలు నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తూ వచ్చిన అర్దేషిర్ ఇరానీ అప్పట్లో బొంబాయికి వచ్చిన "40% సౌండ్" హాలీవుడ్ చిత్రం 'షోబోట్' చూశారు. సినిమా మొత్తం కాకుండా, 40 శాతం మేరే శబ్దాలున్న అది చూశాక, భారతీయ వెండితెరకు 100% సౌండ్ తీసుకురావాలని ఆయన మనస్సులో పడింది. అప్పట్లో మూకీ సినిమా నిర్మాణం మహా అయితే ఓ నెల లోపలే పూర్తయ్యేది. ఆ సమయంలో, దృశ్యంతో పాటు శబ్దాన్ని కూడా రికార్డు చేయాల్సిన నవీన రూపమైన తొలి టాకీ చిత్ర నిర్మాణానికి 4 నెలలు పట్టింది. అనేక సమస్యల మధ్య, ఇతర సంస్థల నుంచి పోటీని అధిగమించి, ప్రత్యర్థి టాకీ నిర్మాతల కన్నా ఓ నెల రోజుల ముందరే 'ఆలమ్ ఆరా'ను ఇరానీ విడుదల చేయగలిగారు. హీరోగా మాస్టర్ విఠల్, హీరోయిన్‌గా జుబేదా, ఇంకా డబ్ల్యు.ఎం. ఖాన్ తదితరులు నటించిన ఆ చిత్రంలో మాటలతో పాటు 10 పాటలతో ప్రజల్లో పెను సంచలనమైంది. సినిమా విడుదలైన తొలి రోజు రాత్రి బ్లాక్‌మార్కెట్‌లో టికెట్ రేటు తారస్థాయిని చేరింది. అసలు ధర కన్నా 20 రెట్లు ఎక్కువకు బ్లాకులో టికెట్లు అమ్ముడయ్యాయి.

అపూర్వ స్వాగతం

ఒక్క బొంబాయిలోనే కాదు, ప్రతి చోటా టాకీలకు బ్రహ్మరథం పట్టారు. బెంగుళూరుకు చెందిన 'మెస్సర్స్ సెలెక్ట్ పిక్చర్స్ సర్క్యూట్' వారు 'ఆలమ్ ఆరా'కు పంపిణీదారులుగా వ్యవహరించారు. ఆ సంస్థలో భాగస్వాములైన డాక్టర్ అంబాలాల్ పటేల్, చిమన్‌లాల్ దేశాయ్‌లు టాకీల ప్రదర్శన కోసం తొలిసారిగా ఎక్కడకు కావాలంటే అక్కడకు తీసుకువెళ్ళగలిగిన సామగ్రిని కొనుగోలు చేశారు. ఆ సాగ్రి వెంట నిపుణులైన ముగ్గురిని ఓ బృందంగా ఏర్పాటు చేసి, దక్షిణ భారతదేశంలోనూ, సిలోన్ (ఇప్పటి శ్రీలంక)లోనూ పెద్ద నగరాలన్నిటికీ వారిని పంపి, టాకీలను ప్రదర్శింపజేశారు. అదో అపూర్వ విన్యాసం. బెంగుళూరులోని సెలెక్ట్ పిక్చర్స్ కంపెనీకి చెందిన టి.ఎస్. మహాదేవ్ అప్పట్లో ఆ చిత్రం వెంట, దాని సౌండ్ ఆపరేటర్‌గా వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఆఫీసు సిబ్బందిలో ఆయనను ఆ పనికి ఎంచుకోవడానికి ఉన్న అర్హత అల్లా - బి.ఎస్సీలో ఎలక్ట్రిసిటీ గురించి చదవడమే! "1931 తొలి రోజుల్లోని ఓ ఉదయం వేళ మేము ప్రయాణిస్తున్న ఆవిరి ఇంజన్ రైలు మద్రాసు సెంట్రల్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చినప్పుడు, అక్కడ "టాకీస్, టాకీస్! మాట్లాడే చలనచిత్రాలు!" అనే అరుపులు ప్రతిధ్వనించాయి. జనంతో క్రిక్కిరిసిన ఆ ప్లాట్‌ఫారమ్ మీద ఉన్న 'కినిమా సెంట్రల్' సినిమా హాలు మేనేజర్ మా అరుపులు చెవినపడగానే, "టాకీస్! టాకీస్!" అని అరుస్తూ, మేమున్న రైలు బోగీనీ, మమ్మల్నీ గుర్తు పట్టారు" అని ఆయన ఆ అనుభవాలను పేర్కొన్నారు. అప్పట్లో టాకీ చిత్రాల రీలు బాక్సులతో పాటు ముగ్గురు వ్యక్తులు, మూడు సామాన్లు వచ్చేవి. ప్రొజెక్టర్, యాంప్లిఫయర్, స్పీకర్ - ఈ మూడూ అతి భద్రంగా ప్రతి టాకీ ప్రదర్శనకూ తీసుకువెళ్ళే సామాన్లు. ఇక, ముగ్గురు మనుషులేమో - ఒకరు ఆపరేటర్ కమ్ ఇంజనీర్, మరొకరు మేనేజర్, మూడో వ్యక్తి సహాయకుడు! ఎక్కడకు వెళ్ళినా, ఈ ముగ్గురికీ, వారితో పాటు కీలకమైన ఆ మూడు సామాన్లకూ అపూర్వమైన రాచ మర్యాదలు లభించేవి! 'సెలెక్ట్ టూరింగ్ టాకీస్' అని అందరూ పిలిచే ఈ బృందానికి అప్పట్లో రైళ్ళలో దిగువ తరగతి రేట్లకే సెకండ్ క్లాస్‌లో ప్రయాణించే రాయితీ ఇచ్చారు. ఇక, లగేజీకీ డబ్బే కట్టనక్కర లేదన్నారు. ఆ తరువాత రోజుల్లో తొలి తమిళ టాకీ 'కాళిదాస్' రీళ్ళు రైల్లో వచ్చినప్పుడు, హారతులిస్తూ, పూలు జల్లుతూ, ఆ పెట్టెలను రైల్వే స్టేషన్ నుంచి హాలు దాకా ఊరేగించారు.

మొదటి తమిళ టాకీ చిత్రం 'కాళిదాస్'లో ఓ దృశ్యం

అఖండ సత్కారాలు

ఈ టాకీ చిత్ర ప్రదర్శకులు పెద్ద పెద్ద నగరాలకు వెళ్ళి, మంచి థియేటర్లు ఎంచుకొని మరీ ప్రదర్శించేవారు. ఆ ప్రాంతానికి వెళ్ళగానే యంత్రాలు వగైరా బిగించి, ప్రదర్శన సరిగా వస్తోందో లేదో పరీక్షించుకొని, 'క్షేమంగా చేరాం! యంత్రాన్ని అమర్చాం. పరీక్ష చేసి చూశాం. శబ్దం ఓ.కె" అంటూ, తమ ప్రధాన కార్యాలయానికి టెలిగ్రామ్ ఇచ్చేవారు. అన్ని కేంద్రాల నుంచీ ఇదే సమాచారం! ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మలబార్, కర్ణాటక, సిలోన్ - ఇలా శరవేగంతో ఊళ్ళన్నీ చుట్టేశారు. ప్రతిచోటా ఈ తొలి టాకీ ప్రదర్శనలకు బ్రహ్మరథం పట్టి స్వాగతించేవారు. తిరుగు ప్రయాణమప్పుడు ఘనంగా వీడ్కోలు పలికేవారు. ఆ ప్రదర్శనలకు డబ్బులు కూడా కుప్పలు తెప్పలుగా వచ్చేవి. టాకీ చిత్ర ప్రదర్శకులు తిరుచ్చి జంక్షన్ నుంచి మదురైకి వెళ్ళాల్సి వచ్చినప్పుడు, రైల్వే స్టేషన్‌కు రావడం ఆలస్యమైంది. గార్డు బండిని ఆపేసి, వాళ్ళు వచ్చాక, ఆలస్యంగా బండిని బయలుదేరదీశాడు. "బండి ఆలస్యమైతే ఫరవాలేదు... వాళ్ళు సెకండ్ క్లాస్ ప్రయాణికులని బండిని ఆపలేదు. వాళ్ళు 'టాకీ మనుషులు' కాబట్టి ఆపాను" అంటూ ఆ గార్డు, మరో రైల్వే అధికారితో వాదించాడు. అదీ - అప్పట్లో టాకీకీ, టాకీ మనుషులకూ ఉన్న గౌరవం.

అప్పటి మైసూరు రాష్ట్రంలోని తుమ్కూరుకు వెళితే, వాళ్ళు ఏ కాఫీ హోటల్‌కు వెళ్ళినా, డబ్బులే తీసుకోలేదు. అక్కడి సినిమా హాలు యజమానే ఆ బిల్లు చెల్లించేలా అతిథి మర్యాదలు చేశారు. ఇక, బరంపురంలో ఈ బృందం ఎక్కడకు వెళ్ళినా, జనం 'టాకీ మనుషులు... టాకీ మనుషులు' అంటూ గుర్తు పట్టేవారు. మార్కెట్‌లో బుట్టల నిండా ఉచితంగా కూరగాయలిచ్చేవారు. కుంభకోణం పట్నంలో టాకీ ప్రదర్శనలో ఓ నృత్య సన్నివేశాన్ని జనం ఆస్వాదిస్తూ ఉండగా, హఠాత్తుగా శబ్దం ఆగిపోయింది. హడావిడిగా హెడ్డాఫీస్‌కు టెలిగ్రామ్ పంపారు. బొంబాయి నుంచి ఇంజనీర్‌ను రప్పించడానికి ఏర్పాట్లు చేశారు. హాలు యజమాని స్వయంగా వేదిక మీదకు వెళ్ళి, జరిగిన సాంకేతిక వైఫల్యానికి క్షమాపణ చెప్పి, డబ్బులు వెనక్కి ఇచ్చేస్తానన్నారు. కానీ, ప్రేక్షకులు మాత్రం 'మేము సినిమా చూడడానికీ, మరీ ముఖ్యంగా 'వినడానికి' వచ్చాం. డబ్బులు వెనక్కిస్తే ఒప్పుకోం' అన్నారు. అదీ అప్పట్లో టాకీకి ఉన్న క్రేజు.

నెల్లూరులో 'వినాయక సినిమా' హాలు యజమానికి బంధువైన ఎం.ఎ, ఎల్.ఎల్.బి. చదివిన ఓ ప్రభుత్వ ఉన్నతాధికారి అయితే, టాకీ ప్రదర్శన వ్యక్తుల దగ్గరకు వచ్చి, శబ్దం ఎలా వస్తుందో అడిగి తెలుసుకున్నారు. 'మానవ ప్రతిభ ద్వారా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ఇంత సులభంగా ఉపయోగించుకున్నప్పుడు, మీ టాకీ కేవలం హిందుస్థానీ భాషలోనే మాట్లాడుతూ, పాడుతోందేం? మరో అడుగు ముందుకేసి, ఏదో ఒక సర్దుబాటు చేసి, మా నెల్లూరులో ఉన్నంత వరకు తెలుగులో మాట్లాడేలా చేయవచ్చుగా!' అని ప్రశ్నించారు. ఆ కల కొన్ని నెలలకే నెరవేరింది. తొలి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' తయారైంది.

బెజవాడలో ఫస్ట్ డే ఫస్ట్ రిలీజ్

బెజవాడ మొదటి నుంచీ సినిమాలకు కీలకమైన కేంద్రం. భారతదేశంలో మొట్టమొదటి టాకీ 'ఆలమ్ ఆరా' బొంబాయిలో విడుదలైన రోజునే బెజవాడలోని 'శ్రీమారుతీ' సినిమా టాకీస్‌లో కూడా విడుదలైంది. అలాగే, బొంబాయి, కలకత్తా, కొల్హాపూర్‌లలో నిర్మించిన చిత్రాలు కూడా మొదటిసారిగా మారుతీ టాకీస్‌లోనే విడుదలయ్యేవి. మారుతీ టాకీస్‌ను నిర్మించిన పోతిన శ్రీనివాసరావు ఆ సంగతుల గురించి ఇలా వివరించారు: " 'ఆలమ్ ఆరా' తరువాత వచ్చిన మొదటి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద'ను కూడా (ఇతర ప్రాంతాల్లో రిలీజైన తొలి రోజునే) మా థియేటర్‌లోనే ఆడించాను. ఆ సినిమా పెద్ద హిట్టు! అప్పట్లో తెలుగులో ఉన్న పత్రికలే తక్కువ. (ఇక ప్రత్యేకించి సినిమా పత్రికలు లేనే లేవు). పత్రికలలో సినిమా వార్తలు వేయాలన్న ఆలోచన కూడా లేదు. అయితే, బొంబాయి, కలకత్తాల నుంచి వచ్చే ఆంగ్ల పత్రికలలో మాత్రం సినిమా వార్తలు ఉండేవి. నిదానంగా మన పత్రికలలో కూడా అప్పుడప్పుడు

'ఆలమ్ ఆరా'లో మాస్టర్ విఠల్, జుబేదా

సినిమా వార్తలు కనిపించేవి".

తెలుగు నాట టాకీ యుగం ప్రారంభంతో, జనంలో సినిమా పట్ల ఆసక్తి, ఆకర్షణ బాగా పెరిగాయి. తెర మీద బొమ్మ కనబడడమే కాక, మాట్లాడుతూ, పాట పాడుతుందనే సరికి, జనమంతా ఎడ్ల బళ్ళు కట్టుకొని మరీ, దగ్గరలోని పట్టణానికి వెళ్ళి, సినిమాను చూసేవారు. 'ఆలమ్ ఆరా' ఘన విజయంతో దేశంలో ఇక వరుసగా "మాటలు, పాటలు, నృత్యాల"తో కూడిన చిత్రాల నిర్మాణం పెరిగిపోయింది. మాట, పాట అత్యంత ప్రధానమైన అంశాలు కావడంతో, నిర్మాతలు సైతం రంగస్థల నటీనటుల్ని సినిమాల్లోకి ఆహ్వానించసాగారు. ఇవాళ్టి లాగా అప్పట్లో నేపథ్య గానం, డబ్బింగ్ లేనే లేవు. చిత్రీకరణ సమయంలోనే నేరుగా రికార్డింగ్ జరిపేవారు కాబట్టి, నటీనటులు తమ మాటలు తామే మాట్లాడాలి. తమ పాటలు తామే పాడాలి. దాంతో, మూకీల రోజుల్లో ఓ వెలుగు వెలిగిన పలువురు నటీనటులు సైతం భాష రాకపోవడం, పాడడం చేతకాకపోవడం లాంటి బలహీనతల వల్ల టాకీలకు అనువుగా తమను తాము మలుచుకోలేకపోయారు. కెమేరాకు దూరమయ్యారు. హిందీ, ఉర్దూ మాట్లాడలేని మూకీ తారలు బాగా దెబ్బతిన్నారు. రూబీ మేయర్స్ (భారతీయ మూకీల కోసం ఈ యూదు మహిళ సులోచన అని పేరు పెట్టుకున్నారు), మారియన్ హిల్ (మన మూకీల్లో పేరు విలోచన) లాంటి మూకీ చిత్రాల స్టార్స్ కనుమరుగయ్యారు. శబ్దచిత్రాల తయారీకి అనువుగా మారే ఆర్థిక సామర్థ్యం లేని పలు స్టూడియోలు మూతబడ్డాయి.

తిరుగులేని టాకీల ప్రస్థానం

తెలుగులో టాకీలు రావడంతో ఇక్కడా మాట, పాట అనుభవం ఉన్న రంగస్థల నటులు కావాల్సి వచ్చింది. 'భక్త ప్రహ్లాద' మొదలు తొలి ఆరేడేళ్ళలో వచ్చిన సినిమాలన్నిటికీ నాటకాలు, రంగస్థల నటులే ఆధారం. జనంలో టాకీలకు పెరిగిన ఆదరణ చూసి, 1930 చివరకొచ్చే సరికల్లా భారతదేశంలోని మొత్తం 370 థియేటర్లలో 30కి పైగా హాళ్ళు శబ్ద చలనచిత్రాలను ప్రదర్శించేందుకు వీలుగా సామగ్రిని శాశ్వతంగా సమకూర్చుకున్నాయి. అప్పటి దాకా మూగచిత్రాలైన 'మూకీ'లను ప్రదర్శించిన హాళ్ళన్నీ శబ్దాన్ని వినిపించే సామగ్రితో 'టాకీస్'గా అవతరించాయి. థియేటర్లుగా, సినిమా హాళ్ళుగా వ్యవహారంలో ఉన్నవి కాస్తా 'టాకీస్' అనే పదాన్ని పేరు చివర తోకగా తగిలించుకున్నాయి. 1932 చివరలో తెలుగులో రెండో టాకీ 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకము' విడుదలైనప్పుడు, ఆ చిత్రం వెంట మహాదేవ్ తదితరులు "ఆంధ్ర, తమిళనాడుల్లో పర్యటించే నాటికే, పెద్ద నగరాల్లో" టాకీ చిత్రాల ప్రదర్శనకు అనువుగా పర్మనెంట్ టాకీస్ వచ్చాయి.

అయితే, టాకీ చిత్రాల నిర్మాణం ప్రారంభమైన తరువాత కూడా కొన్నేళ్ళ దాకా మూకీ చిత్రాల నిర్మాణం, అందులోనూ ప్రధానంగా దక్షిణ భారతదేశంలో కొనసాగింది. అందుకే, మూకీలకు భిన్నమైనవని చెప్పడం కోసం టాకీస్ అనే మాట మన దేశంలో ప్రచలితమైంది. పాశ్చాత్య దేశాల్లో ఆ మాట వ్యవహారంలో లేకపోయినా, మన దగ్గర మాత్రం స్థిరపడిపోయింది. చలనచిత్రాలు 1927లో ఇంగ్లీషులో మాట్లాడితే, మన భారతదేశంలో హిందుస్థానీ (హిందీ - ఉర్దూ మిశ్రమం), బెంగాలీ, తమిళ, తెలుగు భాషల్లో 1931లో, కన్నడంలో 1934లో, మలయాళంలో 1938లో మాటలు నేర్చాయి.

అలా ఎనభై ఏళ్ళ క్రితం గోదాముల్లో, నాటక శాలల్లో టూరింగ్ సినిమా ఎక్విప్‌మెంట్‌తో మొదలైన మన దక్షిణాది భాషల సినిమా ప్రస్థానం ఇవాళ మనిషి కళ్ళు చెదిరే ఐ-మ్యాక్స్, మల్టీప్లెక్స్ థియేటర్లు, 3డి ప్రదర్శనల దాకా సాగింది. మాటే లేని, ఉన్నా సరిగ్గా వినపడని రోజుల నుంచి చెవుల తుప్పు వదిలించే స్టీరియోఫోనిక్ సౌండ్‌ల మీదుగా ఇవాళ్టి డి.టి.ఎస్, డాల్బీ డిజిటల్ సౌండ్‌ల దాకా పయనించింది. ఊరూరా ప్రొజెక్టర్‌ను వెంటేసుకొని తిప్పే రోజుల నుంచి ఉపగ్రహం ద్వారా ఎక్కడికైనా సరే క్షణాల్లో డిజిటల్ పద్ధతిలో సినిమాను ప్రసారం చేసి, ప్రదర్శించే స్థాయికి చేరాం. అందుకే, కళ, కథ, శిల్పం లాంటి వాటి మాట ఎలా ఉన్నా మన టాకీలు ఈ 80 ఏళ్ళలో సాంకేతికంగా ఊహించని ఎత్తులకు ఎదిగాయి. ఎన్ని వినోదాలు వచ్చినా, సినిమా సరికొత్త రూపంలో సామాన్యుడికి వినోదం పంచుతూనే ఉంటుంది. తెర మీద కదిలే బొమ్మల పట్ల ఆకర్షణను పెంచుతూనే ఉంటుంది. ఒక్క ఎనభయ్యే కాదు, మరెన్నో ఎనభైలు వచ్చినా, మన సినిమా మార్కండేయుడిలా నిత్య యౌవన చిరంజీవి!

- రెంటాల జూనియర్

సంగీతానికి స్పందించని మనిషి... మనస్సు వుండదు. అలసిన మనస్సుకు ఆనందాన్ని కలిగించేది సంగీతం. ఎంతటి ఒత్తిడినైనా దూరం చేసే దివ్యౌషధం సంగీతం. మానవ జీవితంతో ముడివడివున్న ప్రతి అంశాన్నీ సాంకేతిక విజ్ఞానం కొత్త పుంతలు తొక్కిస్తోంది. అందులో భాగమే మొబైళ్లలో సంగీతం. ఇప్పుడు ఎవరిని చూసినా చేతిలో సెల్‌ఫోన్, చెవిలో ఇయర్‌ఫోన్స్. ఎఫ్‌ఎం రేడియోలు పోటీ పడి మరీ రకరకాల ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి. అది పక్కన పెడితే... ఇప్పుడు వస్తున్న మొబైళ్లలో ఎఫ్‌ఎం, ఆడియో, వీడియో ఫీచర్లు తప్పని సరి. వీటిని భద్రపర్చుకొనేందుకు కావాల్సినంత మెమరీనీ సైతం అందిస్తున్నాయి.

సంగీత సాగరం... ఒకింత జాగ్రత్త సుమీ...

మనదేశంలో ప్రస్తుతం 4.70 కోట్లమంది మొబైల్ ఫోన్ వినియోగదారులున్నారు. ఈ సంఖ్య రోజురోజుకీ పెరుగుతూనే వుంది. దాంతోపాటు రకరకాల ఫీచర్లు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. మానవ బలహీనతలను సొమ్ము చేసుకోవడంలో ప్రతి కార్పొరేట్ కంపెనీ ముందుపీఠినే వుంటోంది. వినియోగదారులను ఆకట్టుకునేందుకు వారి అభిరుచులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్లను అందించడం అందులో భాగమే. ఇప్పుడొస్తున్న మామూలు మొబైళ్లలో కూడా ఎఫ్‌ఎం, ఆడియో, వీడియో ప్లేయర్లు వుంటున్నాయి. అయితే సంగీతాన్ని అందించడమే ప్రధానంగా అందుకుతగిన ఫీచర్లతో పలు సంస్థలు పోటీలుపడి మరీ వినియోగదారుల ముందుకొస్తున్నాయి.

పయనీర్ మ్యూజిక్

మ్యూజిక్‌ప్రియుల కోసం పయనీర్ కొత్త టెక్నాలజీతో డుయో స్లిమ్‌లైన్ వైర్ లెస్ ఎయిర్ ప్లే మల్టీ రూమ్ సిస్టమ్స్‌ని మార్కెట్లోకి విడుదల చేశాయి. గతంలో ఆపిల్ ఉత్పత్తులను ప్రమోట్ చేసిన పయనీర్ సంస్థ విడుదల చేసిన కొత్త మ్యూజిక్ సిస్టమ్ అత్యాధునిక ఫీచర్లని కలిగి ఉంది. పైగా వై-ఫై కంపాటబులిటీతో పాటు, డిఎల్‌ఎన్‌ఎ కనెక్టివిటీని కూడా సపోర్ట్ చేస్తుంది. దీనితోపాటు VTuner Internet Radio and Bluetooth streamingని కూడా సపోర్ట్ చేస్తుంది. పయనీర్ ఎయిర్ ప్లే సిస్టమ్స్‌లో ఉన్న రెండు ఛానల్ డిజిటల్ ఆంప్లిఫ్లయర్ వల్ల ఇందులోంచి వచ్చేటటువంటి మ్యూజిక్ కస్టమర్లని రాక్ చేసేవిధంగా ఉంటుంది. ఎఫ్‌ఎమ్ రేడియో, ఇంటర్నెట్ రేడియోలను కూడా సపోర్ట్ చేస్తుంది. అంతేకాకుండా రెండు సౌండ్ సిస్టమ్స్ కూడా రిమోట్ కంట్రోల్‌తో చక్కగా పని చేస్తున్నాయి. ఈ సౌండ్ సిస్టమ్స్‌ని వాడే యూజర్లు మ్యూజిక్‌ని ఎడిట్ చేసుకోవడంతో పాటు డిస్‌ప్లే సెట్టింగ్స్‌లో మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించడం జరిగింది. యూజర్లు హెడ్ ఫోన్ల ద్వారా చక్కని అనుభూతిని పొందేందుకు 3.5ఎం.ఎం. ఆడియో జాక్ ప్రత్యేకం. పయనీర్ ఎయిర్ ప్లే మ్యూజిక్ సిస్టమ్స్ అక్టోబర్‌లో మార్కెట్లోకి రానున్నాయి.

సంగీత ప్రపంచంలోకి 'శ్యామ్‌సంగ్'

ఎలక్ట్రానిక్ పరికరాల దిగ్గజం 'శ్యామ్‌సంగ్ గెలాక్సీ' మీడియో ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి అడుగుపెట్టింది. 'ఎస్ వై-ఫై 3.6' (S WiFi 3.6) పేరుతో మీడియా ప్లేయర్‌ను మార్కెట్లో విడుదల చేసింది. ఆండ్రాయిడ్ 2.3 జింజర్ బోర్డు ఆపరేటింగ్ వ్యవస్థ ఆధారితంగా ఈ పరికరం పనిచేస్తుంది. 3.6 అంగుళాల డిస్‌ప్లే సామర్థ్యం కలిగిన ఈ మీడియా ప్లేయర్ అతి వేగంగా స్పందించేందుకు శక్తివంతమైన 1 GHz OMAP ప్రాసెసర్‌ను పొందుపరిచారు. వినియోగదారునికి నాణ్యమైన ఆడియో, వీడియో ప్లేబ్యాక్‌లను అందించే లక్ష్యంతో శ్యామ్‌సంగ్ ఈ గ్యాడ్జెట్‌ను విడుదల చేయనుంది. 3.6 వై-ఫై వ్యవస్థ, HVGA LCD ఎల్‌సీడీ టచ్‌స్క్రీన్, టచ్‌విజ్ టెక్నాలజీ, AMOLED టచ్‌స్క్రీన్ డిస్‌ప్లేలు ఈ పరికరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మైక్రో ఎస్‌డి విధానం ద్వారా జీబీని వృద్ధి చేసుకోవచ్చు. బ్లూ టూత్, జీపీఎస్ వంటి వ్యవస్థలు మరింత సమర్థవంతంగా పనిచేస్తాయి. అక్టోబర్‌లో యూకెలో విడుదల కానున్న 'శ్యామ్ సంగ్ గెలాక్సీ వై-ఫై 3.6', 8 జీబీ, 16 జీబీ వేరియంట్లలో లభ్యమవుతుంది.

Onkyo మ్యూజిక్ పరికరాల జోరు

ప్రముఖ ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీదారైన జపాన్ సంస్థ 'Onkyo కార్పొరేషన్' ఆడియో పరికరాలను తయారు చేయటంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక 'గ్యాడ్జెట్ అవార్డు'లను సొంతం చేసుకున్న ఈ బ్రాండ్ దిగ్గజం ఆపిల్ సంస్థ ద్వారా గుర్తింపు పొందిన 'సరికొత్త టేబుల్ టాప్' ఆడియో పరికరాలతో పాటు హై-ఫై కాంపొనెంట్లను మార్కెట్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ టేబుల్ టాప్ మోడళ్లకు 'ఐ ఓన్లీ ప్లే ఎబిఎక్స్-100', 'ఐ ఓన్లీ బాస్ ఎస్‌బిఎక్స్-300', 'ఐ ఓన్లీ స్ట్రీమ్'గా నామకరణం చేశారు. వీటి ఫీచర్లను పరిశీలిస్తే ఐ ఓన్లీ ప్లే ఎబిఎక్స్-100 డాకింగ్ స్పీకర్‌ను ఐపాడ్‌తో పాటు ఐఫోన్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. ఐఓన్లీ బాస్ ఎస్‌బిఎక్స్-300 స్పీకర్ వ్యవస్థను ఐప్యాడ్‌కు అనుసంధానం చేసుకునే విధంగా రూపకల్పన చేశారు. ఈ పరికరాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌సీడీ టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే కంట్రోల్ బటన్స్ ఆధారితంగా పనిచేస్తుంది. వైర్‌లెస్ రిమోట్ల ద్వారా సౌండ్ వ్యవస్థను ఆపరేట్ చేయవచ్చు. ఈ స్పీకర్లలో పొందుపరిచిన అంశాలు సంగీతాన్ని నాణ్యమైన పిచ్‌లో వినియోగదారులకు అందిస్తాయి.

ఆండ్రాయిడ్ మ్యూజిక్ ప్లేయర్

కుర్రకారును సంగీత సాగరంలో తడిపి ముద్దచేసేందుకు ఆండ్రాయిడ్ ఆధారిత మ్యూజిక్ ప్లేయర్‌ను ప్రముఖ ఎలక్ట్రానిక్ పరికరాల సంస్థ ఫిలిప్స్ అతి త్వరలో విడుదల చేయనుంది.

సాంకేతిక, ఎలక్ట్రానిక్ వస్తు ప్రపంచంలో చోటుచేసుకున్న మార్పుల నేపథ్యంలో ఆధునిక టెక్నాలజీకి ప్రాధాన్యమిస్తూ 'ఫిలిప్స్' సరికొత్త ఆడియో పరికరాలను వినియోగదారులకు అందించనుంది. ఆండ్రాయిడ్ ఆధారంగా రూపుదిద్దుకున్న వీడియో ప్లేయర్‌ను 'గో గేర్ కనెక్టు 3' పేరుతో విడుదల చేయనుంది. ఆండ్రాయిడ్ 2.3 జింజర్ బోర్డు ఆపరేటింగ్ వ్యవస్థ ఆధారితంగా రూపుదిద్దుకున్న ఈ పరికరంలో అత్యాధునిక వై-ఫై వ్యవస్థ వేగవంతమైన ఇంటర్నెట్ సౌలభ్యతను కలిగి ఉంటుంది. ఈ సరికొత్త గ్యాడ్జెట్‌లో పొందుపరిచిన అప్‌డేటెడ్ ఫీచర్లతో ఆన్‌లైన్ ఆండ్రాయిడ్ మార్కెట్ ద్వారా వందల ఆప్లికేషన్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సంగీత ప్రియుల 'సోనీ వాక్‌మెన్'

ప్రతి క్షణం సంగీత ప్రవాహంలో మునిగితేలే యువతరం కోసం 'సోనీ' ఆండ్రాయిడ్ 2.3 జింజర్ బోర్డు ఆధారిత 'వాక్ మెన్'ను మార్కెట్లో ప్రవేశపెట్టనుంది. ఆధునిక సాంకేతికతతో శ్రోతలను సంగీత సాగరంలో ఓలలాడించడానికి సాంకేతిక పరికరాల తయారీదారు 'సోనీ' సరికొత్త ఆండ్రాయిడ్ ఆధారిత 'వాక్‌మెన్'ను విడుదల చేయనుంది. ప్రత్యేకించి సంగీతప్రియుల కోసం రూపుదిద్దుకుంటున్న ఈ 'వాకీ'ని సంగీత ప్రియులే రూపొందించడం విశేషం. సోనీ మునుపటి 'వాక్‌మెన్ల'తో పోలిస్తే, సరికొత్త ఆండ్రాయిడ్ 2.3 జింజర్ బోర్డు ఆధారిత సంగీత పరికరం 250000 ఆండ్రాయిడ్ అప్లికేషన్లను సపోర్టు చేస్తుంది. ఈ వాక్‌మెన్‌లో పొందుపరిచిన సంగీత వ్యవస్థ మరే ఇతర సంగీత పరికరాల్లో లేనంత నాణ్యతను కలిగి ఉంటుంది. ఈ పరికరంలో పొందుపరిచిన 'సెన్స్‌మీ' వ్యవస్థ సంగీతాన్ని నాణ్యమైన పిచ్‌లో శ్రోతలకు అందిస్తుంది.

ఇవేకాకుండా ఇంకా అనేక సంస్థలు తమదైన శైలిలో వినియోగదారుల మనసు చూరగొనే ప్రయత్నం చేస్తున్నాయి. మరిన్ని కొత్తకొత్త సంస్థలు, సరికొత్త ఫీచర్లతో రాబోతున్నాయి.

ఆరోగ్యంపై సెల్‌ఫోన్ ప్రభావం

మన దేశంలో సెల్‌ఫోన్ల వినియోగం రోజురోజుకీ పెరుగుతోంది. రింగ్‌టోన్లు, కాలర్ ట్యూన్లు, ఎస్‌ఎంఎస్‌లు అంటూ ఎన్నో రకాలుగా సెల్‌ఫోన్ల వాడకం పెరిగిపోతోంది. ఇది బాగానే ఉందిగాని, ఈ సెల్‌ఫోన్ల వల్ల వచ్చే అనర్థాల గురించి పట్టించుకోకపోవడం విచారకరమని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా ఈ సెల్‌ఫోన్ల పిల్లలు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారని వారు పేర్కొంటున్నారు. గేమ్స్ ఆడడం, పాటలు వినడం, సినిమాలు చూడడంలో పిల్లలు సెల్‌ఫోన్లని ఎక్కువగా వాడుతున్నారు. మూడు సంవత్సరాల వయసుకన్నా తక్కువ వయసు పిల్లలకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచడం చాలా మంచిదని సాంకేతిక నిపుణులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సెల్‌ఫోన్లు రిసీవ్ చేసుకునే సిగ్నల్స్ కారణంగా రేడియో ధార్మికత వల్ల చిన్న పిల్లల్లో మెదడుకి సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వారి ఆలోచనా శక్తి క్రమేపీ మొద్దుబారే ప్రమాదం ఏర్పడుతోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఓ బ్రిటీష్ శాస్త్రవేత్త ఈ సెల్‌ఫోన్ల వల్ల వస్తున్న అనర్థాల గురించి కొన్ని హెచ్చరికలు చేసారు. ముఖ్యంగా వైర్‌లెస్, సెల్‌ఫోన్ల నుంచి విడుదలయ్యే రేడియో ధార్మిక కిరణాలు సున్నితమైన మెదడు కణజాలాన్ని నాశనం చేస్తున్నాయని, చిన్నపిల్లల్లో ఇది బాగా ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేసారు. సెల్‌ఫోన్లు బాగా వాడే యువకుల రోజువారీ ప్రవర్తనను పరిశీలించిన బృందానికి వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి, చిరాకుకీ గురవుతున్నారని తెల్సింది. సెల్‌ఫోన్ల ప్రభావం వల్ల చిన్నపిల్లలు వత్తిడికి గురవ్వడంతో పాటు సరిగా చదవలేక పోతున్నారని, తలనొప్పికి గురవుతున్నట్లుగా కూడా వెల్లడైంది. సెల్‌ఫోన్లతో పాటు మ్యూజిక్ సిస్టమ్స్ వల్ల కూడా ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన వెల్లడించారు. ముభావంగా ఉండడం, ఆకలి మందగించడం, ఎక్కువసేపు మెలకువగా ఉండడం, సరిగా చదవలేకపోవడం, చదివినది గుర్తుంచుకోకపోవడం వంటి లక్షణాలు చిన్నారుల్లో కనిపించినట్లు స్టీవార్డ్ తన పరిశోధన ఫలితాలు వివరించారు. అందుకే పాఠశాలల్లో మ్యూజిక్ సిస్టమ్స్, సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేధించాలని ఆస్ట్రేలియా మెడికల్ అసోసియేషన్ సూచించింది. ఆస్ట్రేలియా, చైనా అమెరికాలోనూ చిన్నారుల్లో ఇలాంటి లక్షణాలు అధికంగా నమోదవుతున్నాయి. భారత్‌లోనూ ఈ అనారోగ్య లక్షణాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. మన దేశంలో వివిధ సెల్‌ఫోన్ కంపెనీలు అందిస్తున్న ఆఫర్ల వలలో మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా చిక్కుకుంటున్నారు. క్రమేపీ చిన్నారుల ఆరోగ్యాన్ని ఈ సెల్‌ఫోన్ రేడియో ధార్మికత కబళించే ప్రమాదం ఉందని స్వచ్ఛంద సంస్థలు హెచ్చరిస్తున్నాయి. అందుకే సెల్‌ఫోన్లు చిన్నారులకు అందుబాటులో లేకుండా చూసుకుంటే వారి ఆరోగ్యానికి ఎంతో మంచిది. చిన్న పిల్లలకే కాదు పెద్దలకూ ఇవి వర్తిస్తాయి. కాకపోతే వారికి కాస్త ఆలస్యం కావచ్చు. బ్రాండెడ్ సెల్‌ఫోన్లతో ఎక్కువసేపు మాట్లాడినా, సంగీతం విన్నా ఇబ్బంది ఉండదు. అదే అన్‌బ్రాండెడ్ మొబైల్‌తో 5 నిమిషాలు మాట్లాడినా.. చెవి దగ్గర వేడెక్కుతుంది. ఫోన్ నుంచి అధిక రేడియేషన్ వెలువడటమే ఇందుకు కారణం. అందుకే సెల్‌ఫోన్ కొనేటప్పుడు కెమేరా, వీడియో ప్లేయర్, ఎంపీ 3, ఇంటర్నెట్ వంటి ఫీచర్లతో పాటు రేడియేషన్ ఎంత వెలువరిస్తుందో కూడా తెలుసుకోవడం అవసరం.

వయస్సుతో నిమిత్తం లేకుండా ఎవ్వరి చేతిలో చూసినా సెల్‌ఫోన్ కనిపిస్తున్న రోజులివి. క్షణాల్లో విషయాలు తెలుసుకోగల ఈ సాంకేతిక విప్లవం మంచిదే. అయితే 'అతి అనర్ధదాయకం' అన్న సూత్రం ఇక్కడా వర్తిస్తుంది. సరదాకో, మానసిక ఉల్లాసానికో, ఒత్తిడి నుంచి బయటపడేందుకో సంగీతం ఒక సాధనమే. అయితే అందుకు అనుసరించే పద్ధతుల పట్ల ఒకింత జాగరూకత తప్పనిసరి.

- కె.ఎక్స్.రాజు

ఈ న్యూస్

మొబైల్‌లో బ్రౌజింగ్‌వైపే మొగ్గు

నోకియా-నీల్సన్ సంస్థలు ఇటీవల చేసిన సర్వేలో ఓ ఆసక్తికరమైన విషయం వెల్లడైంది. అదేంటంటే... మనదేశంలో ప్రస్తుతం మొబైల్ ఫోన్ వినియోగదారులు 4.70 కోట్లమంది. ఇందులో ఇంటర్నెట్ వినియోగిస్తున్నవారు 1.18 కోట్లు. మొబైల్ ఫోన్లలో ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న వారిలో అత్యధికులు బ్రౌజింగ్‌కే మొగ్గుచూపుతున్నారు. ఆ తర్వాతి స్థానం ఈ-మెయిల్/చాటింగ్‌ది కాగా మూడో స్థానం సోషల్ నెట్‌వర్కింగ్ దక్కించుకుంది. నోకియా సర్వీసెస్ మార్కెటింగ్ హెడ్ జస్మీత్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌తో సహా ఎనిమిది నగరాల్లో రూ.6 వేలలోపు విలువ చేసే వివిధ కంపెనీల మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్న 2,734 మంది కస్టమర్లపై సర్వే చేపట్టినట్టు ఆయన చెప్పారు. అంతేకాకుండా మొబైల్స్ కు సంబంధించినంత వరకు బ్రాండ్, స్క్రీన్ రిజల్యూషన్, కెమెరా తర్వాత ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నవాటికే కస్టమర్లు ప్రాధాన్యమిస్తున్నట్లు ఈ తాజా సర్వేలో తేలింది. వెబ్‌సైట్ బ్రౌజింగ్‌లో యాహూ తొలిస్థానం ఆక్రమించగా, ఫేస్‌బుక్, జీమెయిల్, గూగుల్, ఆర్కుట్, ట్విట్టర్‌లు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

చూద్దామా

అక్కడ ప్రతి గృహమూ సంపూర్ణంగా సహజ పదార్థాలతోనే నిర్మితమైంది. అన్ని వస్తువులూ అందంగా, ఆకర్షణీయంగా అమర్చబడ్డాయి. పైగా, టీవీలూ లేకపోవడంతో నగర జీవులు కోల్పోయిన ప్రశాంతత ఎంత మధురంగా ఉంటుంతో తెలిసొచ్చింది. చెట్లపై అతెంత్తులో, పక్షులతో సావాసంలా అనిపించింది. పక్షులు ఎంత అదృష్టమైనవి అని కూడా అనిపించింది. చీకటి పడుతుంటే ఇంట్లో కిరోసిన్ దీపాలూ, చీకటి పడ్డాక జోకొట్టినట్లు చెట్ల ఊయల.. ఎప్పటికీ అక్కడే ఉండిపోవాలన్నంత ఆశ.



వైతిరి వృక్షగృహాలు

విహార యాత్రల్లోనూ వింత అనుభవాల కోసం అన్వేషించే వారికోసం కేరళలోని వైతిరి ప్రాంతం అనువైనది. ఎందుకంటే ఇక్కడ యాత్రికుల కోసం ప్రత్యేకంగా కట్టిన ఇళ్లుంటాయి. అందులో విశేషమూ, వింతా ఏముందని అనుకుంటున్నారా? ఆ ఇళ్లు చెట్లమీద ఉండడమే విశేషం. ఆ చెట్లు దట్టమైన అరణ్యంలో ఉండడమే మరో విశేషం.

మేము కాలికట్ నుండి జీబులో ప్రయాణిస్తూ అరగంటలో వైతిరి చేరాం. అది కాలికట్ - మైసూర్ రహదారిలో ఉంది. ఇక్కడికి ఎర్నాకులం నుండి కూడా తేలికగా రావచ్చు.

వైతిరి చాలా ఎత్తైన ప్రదేశం. సుమారు 1,300 మీటర్ల ఎత్తున్న ఈ హిల్‌స్టేషన్, ఎటు చూసినా కాఫీ, తేయాకు, యాలకులు, మిరియాలు, రబ్బరు తోటలతో కనువిందు చేస్తుంది. కళ్లకే కాదు, ఆ తోటల నుండి వచ్చే వింత సువాసనలు విచిత్ర అనుభూతిని కలిగిస్తాయి. అరణ్యంలో కాలిబాటల గుండా అలా నడుస్తూ వెళ్లడం, పక్షుల సందడీ, గాలికి చెట్ల సవ్వడీ... నిజంగా అనుభవిస్తే గానీ అసలు ఆనందం కలగదు. ఈ వైతిరి రిసార్ట్ వయనాడ్ జిల్లా అరణ్యంలో ఉంది.

ఇక్కడికి సుమారు అరమైలు దూరంలో పూకోట్ సరస్సు ఉంది. చుట్టూ దట్టమైన వనసంపదతో, స్వచ్ఛంగా కనిపించే సరస్సులో బోటు షికారు బావుంది. ఈ సరస్సులో నీలిరంగు తామరపూలు అద్భుతంగా కనిపిస్తాయి. పడవలో ప్రయాణించేటప్పుడు వాటిని అందుకుని కోసేసుకోవాలనిపించినా, వాటిని తాకడం కూడా నిషేధమని తెలిసి బాధపడ్డాం.

వైతిరి ప్రాంతంలోని తేయాకు తోటల్లో నుండి, అరణ్యం గుండా వెళ్లే మార్గంలో 'చెంబ్రా పీక్' అనే కొండ ఉంది. ఈ ప్రాంతంలో అదే ఎత్తైనదట. దాని ఎత్తు 2,100 మీటర్లు. దీని పైకి ఎక్కడానికి ఒక రోజు పడుతుందట. మేం ఎక్కలేదు (సమయాభావం వల్ల) కానీ దానిపైన కూడా ఒక సరస్సు ఉందట. దానిపేరు హృదయ సరస్సు - హృదయం ఆకారంలో!

ఇంకా ఇక్కడ పురాతన గుహలు, జలపాతాలూ వగైరాలు ఉన్నాయి గానీ చెట్లమీద నివాసం కోసమే మేం ఇక్కడికి వచ్చాం.

కేరళ అనగానే 'పడవల ఇళ్లు' గుర్తుకొస్తాయి. కానీ దట్టమైన అడవుల్లో, ఎత్తైన చెట్లపై ఇళ్లు కట్టి టూరిజాన్ని ఆకర్షణీయంగా చేయడం కొత్తగా ఉంది.

నేలకు సుమారు 80– 90 అడుగుల ఎత్తులో కనిపించే ఈ 'వృక్షగృహాల్ని' చూస్తుంటేనే అబ్బురంగా అనిపించాయి. ఒక వెదురు బుట్టలాంటి 'లిఫ్ట్'లో అంత ఎత్తుకి వెళ్లాం. విచిత్రమేమిటంటే ఈ లిఫ్టుకి విద్యుత్ సౌకర్యం లేదు, శబ్ద కాలుష్యమూ లేదు. మొత్తం అత్యంత సహజంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిసిపోతుంది. లిఫ్టు దిగాక, ఇంట్లోకి వెళ్లడానికి ఒక తాళ్ల వంతెన... ఆ దృశ్యమే మతి పోగొడుతుంది.

అక్కడ ప్రతి గృహమూ సంపూర్ణంగా సహజ పదార్థాలతోనే నిర్మితమైంది. అన్ని వస్తువులూ అందంగా, ఆకర్షణీయంగా అమర్చబడ్డాయి. పైగా, టీవీలూ లేకపోవడంతో నగర జీవులు కోల్పోయిన ప్రశాంతత ఎంత మధురంగా ఉంటుంతో తెలిసొచ్చింది. చెట్లపై అంతెత్తులో, పక్షులతో సావాసంలా అనిపించింది. పక్షులు ఎంత అదృష్టమైనవి అని కూడా అనిపించింది. చీకటి పడుతుంటే ఇంట్లో కిరోసిన్ దీపాలూ, చీకటి పడ్డాక జోకొట్టినట్లు చెట్ల ఊయల.. ఎప్పటికీ అక్కడే ఉండిపోవాలన్నంత ఆశ.

భోజనాలు సాదాసీదాగా ఉన్నాయి. స్పూన్లూ, ఫోర్కులూ ఉండవు. మంచినీళ్లు దగ్గరలోని వాగునుండి తెచ్చి ఫిల్టర్ చేసి ఇస్తారు. అక్కడ కూడా సౌరశక్తి తప్ప జనరేటర్లూ గట్రా లేవు. ఆహార పదార్థాలు అన్నీ సేంద్రియ పద్ధతిలో బయోగ్యాస్ పైనే వంట! అచ్చంగా పల్లెలు అనుభవమున్న వారికి కూడా ఈ బస కొత్తగా అనిపిస్తుంది.

మనకి ఆసక్తి ఉంటే అడవిలో అలా నడుచుకుంటూ వెళ్లొచ్చు. లేదా చెట్లపైనే కాళ్లు చాపుకుని ఒక కొత్త కోణంలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఉండొచ్చు (మేం చేసినట్లు).

మాలో దుబాయ్ చూసొచ్చిన ఒకతను "ఈ ప్రదేశం ఉందని తెలిస్తే అక్కడికి వెళ్లి ఉండేవాడిని కాదు. అక్కడిదంతా డబ్బు చేసిన విన్యాసం. ఇక్కడంతా అచ్చమైన ప్రకృతి" అన్నాడు.

- యాజీవ్

నవ్వుల్ - పువ్వుల్

వారసత్వం

డాక్టర్: సుబ్బయ్యగారూ! తమాషా ఏంటంటే... ఈ జబ్బు మీతో రాలేదు. వంశపారంపర్యంగా వచ్చింది.
సుబ్బయ్య: అమ్మయ్య బతికించారు. అయితే ఆ ఆపరేషన్ ఏదో మా తాతయ్యకు చెయ్యండి.

సన్నాయి

కొడుకు: నాన్నా! నాకు సన్నాయి నేర్చుకోవాలని వుంది. నాకు ఒక సన్నాయి కొనిపెట్టవా?
తండ్రి: వద్దురా బాబూ! వేళా పాళా లేకుండా వాయిస్తే ఇంట్లో గోలగా వుంటుంది.
కొడుకు: ఫర్లేదు నాన్నా! మీరంతా నిద్రపోయాకే వాయిస్తాగా.

ఇద్దరు

పిన్ని: ఆఖరుకు యంత్రాలకు కూడా చులకనైపోయాను. వాటి బండబడ...
సుభద్ర: ఏంటి పిన్నీ కోపంగా వున్నారు?
పిన్ని: ఏం లేదమ్మాయ్! ఇవాళ రైల్వే స్టేషన్‌లో వెయ్యింగ్ మిషన్ మీద ఎక్కి రూపాయి బిళ్ల వేశాను. ఏమని వచ్చిందో తెల్సా!
సుభద్ర: ఏమని...పిన్నిగారూ...
పిన్ని: 'ఒక్కసారే ఇద్దరు ఎక్కకూడదు' అని.

చెక్కు

డాక్టర్: రావయ్యా సూర్యం. ఇప్పుడు నీ గురించే చెప్పారు మా వాళ్లు.
సూర్యం: ఎందుకండీ....
డాక్టర్: ఫీజు కింద నువ్వు ఇచ్చిన చెక్కు బౌన్స్ అయ్యిందట
సూర్యం: అవునా! మీరు నయం చేసిన జబ్బు కూడా తిరిగి వచ్చింది.

పట్టుదల

సోము: పట్టుదల వుంటే మనిషి సాధించలేనిది లేదోయ్!
రాము: ఔనా! అయితే గ్లాసులో నీళ్లు కింద పారబోస్తున్నాను. గ్లాసులోకి ఎత్తు చూద్దాం.

పళ్లు ఊడాలి

(బాక్సింగ్ పోటీ మహా రంజుగా జరుగుతోంది)
ప్రేక్షకుడు: ఊ...కొట్టు... బాగా కొట్టు... దెబ్బకు వెధవ పళ్లన్నీ రాలిపోవాలి. ఒక్కటి కూడా మిగలకూడదు.
పక్క ప్రేక్షకుడు: ఏంటి మీకు బాక్సింగ్ అంటే అంత ఇష్టమా!
ప్రేక్షకుడు: కాదు. నేను పక్క వీధిలో పళ్ల డాక్టర్ని

ఏమంటారు?

టీచర్: టర్కీ వారిని టర్క్స్ అని పిలుస్తారు. మరి జర్మనీ వాళ్లను ఏమని పిలుస్తారో తెలుసా?
పిల్లవాడు: నాకు తెలుసు టీచర్.
టీచర్: ఏమంటారు?
పిల్లవాడు: జర్మ్స్

ముందు అతనికే

(అత్తగారింటికి పంపుతున్న కూతురికి జాగ్రత్తలు చెప్తోంది తల్లి)
తల్లి: భోజనం ముందుగా నీ భర్తకే వడ్డించాలమ్మడూ. బాగా గుర్తెట్టుకో.
కూతురు: ఏమ్మా! అందులో ఏమైనా తేడా వుంటే మనకు ముందుగా తెలుస్తుందనా!

పలావ్



భార్య: ఏవండోయ్! గుర్తుందా ఇవాళ మన పెళ్లి రోజు. వచ్చేటప్పుడు కోడిని తీసుకురండి. పలావ్ చేసుకుందాం.
భర్త: మనం చేసిన తప్పుకు పాపం దానికి శిక్ష వెయ్యడం బాలేదే!

ఆలస్యం

టీచర్: ఇవాళ కూడా ఆలస్యంగా వచ్చావెందుకురా!
పిల్లవాడు: 'బడికి ఆలస్యంగా రాను' అని వందసార్లు ఇంపోజిషన్ రాయమన్నారుగా.
టీచర్: అయినా ఆలస్యంగా వచ్చావుగదరా...
పిల్లవాడు: అసలు ఆలస్యానికి కారణం అదే టీచర్. రాస్తూ కూర్చుంటే టైమ్ అయిపోయింది.

కె. వీరేంద్ర, ఒమ్మెవరం.

అట్టమీది కథ

సిబిఐ

ఏ కేసైనా సై

సిబిఐ... ఈ పేరు వింటేనే అవినీతి మహారాజులకు, ఘరానా నేరగాళ్లకు, అమానుష ఉగ్రవాదులకు హడల్. సిబిఐ కన్ను పడకూడదని అక్రమ సంపాదన చేసే రాజకీయ నాయకులు, ప్రధాన నేరగాళ్లు, టెర్రరిస్టులు కోరుకొంటారు. తాము సంపాదించిన అక్రమ సంపాదన వివరాలు సిబిఐ కంటపడకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటారు. అయినా కొందరి పాపం పండుతుంది. వారు సిబిఐ ముందు దోషిగా నిలబడక తప్పదు. కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణంలో సురేష్ కల్మాడీ, 2జి కుంభకోణంలో కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా, కనిమొళి, గనుల అక్రమ రవాణాలో గాలి జనార్ధన్ రెడ్డి వంటి వారికి సిబిఐ ఉచ్చు బిగుసుకున్నది. సిబిఐ చొరవతో వీళ్లంతా ప్రస్తుతం జైలు ఊచలు లెక్కపెడ్తున్నారు. తాజాగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై కూడా సిబిఐ కన్ను పడింది. సిబిఐ శోధనతో ఇప్పటికే కలవరిపడిపోతున్నారు జగన్. ఈ నేపథ్యంలో సిబిఐ గురించి తెలుసుకుందాం...

- ఎం.డి.హసన్ షరీఫ్

సిబిఐ దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థ. అందుకే ఏ రాజకీయ నాయకుడిపైనైనా అవినీతి ఆరోపణలొస్తే సిబిఐ దర్యాప్తు కోసం రాజకీయ పక్షాలు పట్టుబడ్తాయి. ఆఖరి అస్త్రంగా సుప్రీం కోర్టు, హైకోర్టులు, పార్లమెంటు, ప్రజలు సిబిఐ విచారణ కోసం డిమాండ్ చేస్తారు. అయితే సిబిఐకి కూడా అనేక పరిమితులు, రాజకీయ విధేయత వంటి ఆరోపణలున్నాయి. ఇంటర్‌పోల్ సభ్య దేశాల సమన్వయంతో దేశంలో అంతర్రాష్ట్రాల, అంతర్జాతీయ నేరాలకు సంబంధించిన ప్రధాన నేరాలపై కూడా సిబిఐ దర్యాప్తు నిర్వహిస్తోంది. అవినీతి నిరోధక, ఆర్థిక నేరాలు, ప్రత్యేక నేరాల విభాగాల్లో సిబిఐ దర్యాప్తు సాగిస్తుంది. అవినీతికి పాల్పడిన ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, ఐఎఎస్‌లు, బ్యాంకుల, ఆర్థిక, ప్రభుత్వ రంగ సిఎండి వంటి ఉన్నతాధికారులపై వచ్చిన కేసులను దర్యాప్తు చేస్తుంది. దీని ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది.

సిబిఐ ఏర్పాటు నేపథ్యం

సిబిఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) భారత ప్రభుత్వ ఏజెన్సీ. ఇది క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ బాడీ. నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ. ఇంటెలిజెన్స్ ఏజెన్సీ. 1941లో భారత ప్రభుత్వం స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎస్‌పిఇ)ను ఏర్పాటు చేసింది. అందులో నుండి సిబిఐ 1963 ఏప్రిల్ ఒకటిన ఏర్పడింది. అంటే సిబిఐకి ఎస్‌పిఇ మాతృ సంస్థ. రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా జరిగిన అవినీతి, లంచగొండి తనంపై విచారణ జరిపేందుకు ఎస్‌పిఇని ఏర్పాటు చేశారు. ఎస్‌పిఇ అధినేత యుద్ధ విభాగానికి చెందిన వ్యక్తి. యుద్ధం తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వోద్యోగుల లంచగొండితనం, అవినీతిపై ఎస్‌పిఇ విచారణ జరిపింది. ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1946లో ప్రారంభమైంది. దీన్ని తర్వాత కేంద్ర హోం డిపార్ట్‌మెంట్‌కు బదలాయించారు. దాని విచారణాధికారాలను తర్వాత అన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు, రాష్ట్రాలకు విస్తరించారు. సిబిఐ అవినీతికి సంబంధించిన కేసుల్లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ పర్యవేక్షణలో, ఇతర విషయాల్లో కేంద్ర పర్సనల్, పెన్షన్, గ్రీవెన్సెస్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంది. కాలానుగుణంగా సిబిఐ దేశంలో ప్రధాన దర్యాప్తు ఏజెన్సీగా పేరు సంపాదించింది. దీంతో అవినీతి, ఆర్థిక అవకతవకలు, హత్య, కిడ్నాపింగ్ తదితర క్లిష్టమైన కేసుల్లో సిబిఐ విచారణ జరిపించాలనే డిమాండ్ పెరిగింది. అంతేకాదు సంబంధిత పార్టీలు వేసిన పిటిషన్ల ఆధారంగా కొన్ని ప్రధాన కేసులను విచారించాల్సిందిగా సుప్రీంకోర్టు, వివిధ రాష్ట్రాల హైకోర్టులు సిబిఐని ఆదేశించాయి. కేంద్ర పర్సనల్, ప్రజా పరిపాలన, కేంద్ర ప్రభుత్వ పెన్షన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గల డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ నియంత్రణలో సిబిఐ పనిచేస్తోంది. భారత్‌కు సిబిఐ అధికారిక ఇంటర్‌పోల్ యూనిట్. క్రిమినల్ నేరాలతో పాటు ఆర్థిక నేరాల దర్యాప్తు కూడా చేపట్టాల్సి రావడంతో సిబిఐలో రెండు విభాగాలను ఏర్పాటు చేయాలని 1987లో నిర్ణయించారు. అవి 1. అవినీతి నిరోధక విభాగం. 2. ప్రత్యేక నేరాల విభాగం. కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే సిబిఐ తన రిపోర్టులను కేంద్ర ప్రభుత్వానికే సమర్పిస్తుంది. రాష్ట్రాలకు నివేదికలు సమర్పించాల్సిన అవసరం సిబిఐకి లేదు. సిబిఐకి

చెందిన అవినీతి నిరోధక విభాగం ప్రధాన కార్యాలయం ముంబయిలో ఉంది.

ఎన్ఐఎ, సిబిఐల మధ్య తేడా?

నవంబర్ 2008లో ముంబయిలో ఉగ్రవాద దాడి తర్వాత నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) అనేది ఏర్పాటు చేశారు. ప్రప్రథమంగా ఇటీవల ఢిల్లీలో హైకోర్టులో జరిగిన పేలుళ్ల దర్యాప్తు బాధ్యతను దానికి అప్పగించారు. ఎలా పనిచేస్తుందో ఇంకా చూడాలి. దాడుల తీరు, ఉగ్రవాదులకు నిధులు ఎలా వచ్చాయి, ఇతర ఉగ్రవాద నేరాలపై ఎన్.ఐ.ఎ దర్యాప్తు చేస్తుంది. సిబిఐ ప్రధానంగా అవినీతి, ఆర్థిక అవకతవకలు, తీవ్రస్థాయి కేంద్రీకృత నేరాలపై దర్యాప్తు చేస్తుంది. డిఎస్‌పిఇ యాక్ట్, సెక్షన్ 2 ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రమే సెక్షన్ 3 కింద జరిగిన నేరాలకు సంబంధించిన కేసులను సిబిఐ సుమోటోగా (ఉన్న పళంగా) తీసుకొని దర్యాప్తు చేసే అధికారం కలిగి ఉంది. వివిధ రాష్ట్రాల్లో జరిగిన నేరాలకు సంబంధించి సెక్షన్ 6 ప్రకారం ఆయా రాష్ట్రాల అనుమతితో మాత్రమే దర్యాప్తు చేపడుతుంది. కేంద్రం కూడా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించిన తర్వాత సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలి. సుప్రీం కోర్టు, హైకోర్టులు రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించకుండానే సిబిఐ దర్యాప్తునకు ఆదేశించవచ్చు. ఆయా రాష్ట్రాల పోలీసులు దర్యాప్తు చేయగలిగే సాధారణ నేరాలు, కేసులను సిబిఐ చేపట్టరాదు. అవినీతికి పాల్పడే కేంద్ర ప్రభుత్వోద్యోగిపై ఎవరైనా, దేశంలోని ఏ ప్రాంతంలోనైనా సిబిఐకి చెందిన అవినీతి నిరోధక విభాగంలో వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయవచ్చు. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో, ప్రధాన నగరాల్లో దీనికి కార్యాలయాలున్నాయి. సిబిఐ తనకు కావాల్సిన సమాచారాన్ని తనదైన శైలిలో రాబడుతుంది. తమ ఆధీనంలోకి తీసుకున్న వ్యక్తులు చెప్పిన నోటిమాటగా తెల్పిన సమాచారాన్ని కూడా ఆధారంగా వినియోగించుకునే వెసులుబాటు సిబిఐకి ఉంది. కోర్టులు కూడా దానికి సంబంధించిన ఆధారాలు చూపించాలని పట్టుబట్టే అవకాశం లేదు.

ట్రాప్ అంటే ఏంటి?

కేంద్ర ప్రభుత్వోద్యోగి లంచం తీసుకుంటుండగా సిబిఐ ప్రత్యక్షంగా దాడి చేసి పట్టుకోవడాన్ని ట్రాప్ (వల పన్నడం) అంటారు. ఆ సందర్భంగా పట్టుకొన్న డబ్బును సిబిఐ సీజ్ చేసి కోర్టులో ఛార్జిషీటుతో సహా ప్రవేశపెడ్తుంది. కేసు పూర్తయిన తర్వాత ఆ డబ్బును సంబంధిత వ్యక్తికి అందజేస్తారు. సిబిఐలో అవినీతిని అంతమొందించాలనే ఉద్దేశ్యంతో అంతరంగికంగా విజిలెన్స్‌ను ఏర్పాటు చేశారు.

రెడ్ నోటీసు

ఇంటర్‌పోల్ ప్రధాన కార్యాలయం ఫ్రాన్స్‌లో ఉంది. ఒక దేశంలో నేరం చేసిన వ్యక్తి మరో దేశంలో తలదాచుకుంటే ఇంటర్‌పోల్ వారికి నోటీసు జారీ చేస్తుంది. దీంతో సంబంధిత దేశం చర్యలు తీసుకొని ఆ నేరస్తుణ్ణి అప్పగించాల్సి ఉంటుంది. సిబిఐకి ఇంటర్‌పోల్‌ను వినియోగించుకునే సదుపాయం పరిమితంగా ఉంది. దీని కోసం విదేశీ మంత్రిత్వ శాఖపై సిబిఐ ఆధారపడాల్సి ఉంది. ఆ మంత్రిత్వ శాఖ కోరితేనే ఇంటర్‌పోల్ సహాయం తీసుకునే అవకాశం సిబిఐకి ఉంది.

సిబిఐలో చేరాలంటే!

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ద్వారా సిబిఐ సబ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులను భర్తీ చేస్తుంది. ఇన్‌స్పెక్టర్, దానికంటే ఎక్కువ కేటగిరీ గల పోస్టులను డిప్యుటేషన్‌పై భర్తీ చేస్తుంది. నాన్ పోలీసు అధికారులు కూడా సిబిఐలో డిప్యుటేషన్‌పై చేరవచ్చు.

సిబిఐ అధినేత డైరెక్టర్

డైరెక్టర్ (గ్రూప్-ఎ : ఒక్క పోస్టు) : సిబిఐ అధినేత డైరెక్టర్. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు లేదా కమిషనర్ ఆఫ్ పోలీసు (రాష్ట్రం) స్థాయి ఐపిఎస్ అధికారి దీనికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. ఆయన పదవీ కాలం రెండేళ్లు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ నేతృత్వంలో హోం సెక్రటరీ, సెక్రటరీ, క్యాబినెట్ సెక్రటేరియట్ సభ్యులుగా గల కమిటీ డైరెక్టర్‌ను నియమిస్తుంది.

స్పెషల్ డైరెక్టర్ (గ్రూప్-ఎ : ఒక్క పోస్టు) : సిబిఐలో స్పెషల్ డైరెక్టర్ రెండో ర్యాంకు అధికారి. అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా నియమితుడైన ఐపిఎస్ అధికారిని స్పెషల్ డైరెక్టర్‌గా నియమించవచ్చు.

అడిషనల్ డైరెక్టర్ (గ్రూప్-ఎ : రెండు పోస్టులు) : అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ర్యాంకు గల ఐపిఎస్ అధికారిని అడిషనల్ డైరెక్టర్‌గా నియమిస్తారు.

జాయింట్ డైరెక్టర్ (గ్రూప్-ఎ : 16 పోస్టులు) :

తెలుగు డైరెక్టర్

పి.వి.నరసింహారావు హయాంలో సిబిఐ డైరెక్టర్‌గా మన రాష్ట్రానికి చెందిన కె.విజయ రామారావు (31 జులై 1993 నుంచి 31 జులై 1996 వరకూ) కూడా పని చేశారు. తర్వాత ఆయన తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగానూ వ్యవహరించారు. ఆయన డైరెక్టర్‌గా ఉన్న కాలంలోనే బాబ్రీ విధ్వంసం, హర్షద్ మెహతా కుంభకోణం వంటివి సిబిఐ దర్యాప్తు చేసింది.

ఎవరీ లక్ష్మీనారాయణ!

సిబిఐలో జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ పేరు ఇప్పుడు మారుమోగుతోంది. గాలి జనార్ధన రెడ్డి, జగన్ అక్రమాలపై, ఆర్థిక వ్యవహారాలపై ఆయన ఆధ్వర్యంలో దర్యాప్తు సాగుతోంది. లక్ష్మీనారాయణ తెలుగువాడే. కడప నగరం గుంత బజారులోని సాయి నిలయంలో ఏప్రిల్ 3, 1965న జన్మించారు. షణ్ముగం, వసుంధరల ఏకైక కుమారుడు లక్ష్మీనారాయణ. ఆయన తాత వాసగిరి సుబ్బయ్య కడప తహసీల్దారుగా పనిచేసేవారు. షణ్ముగం ఎస్ఆర్‌బిసిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నందికొట్కూరులో ఉద్యోగం చేశారు. దీంతో లక్ష్మీనారాయణ విద్యాభ్యాసం సున్నిపెంటలో ప్రారంభమైంది. శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత విద్య అభ్యసించారు. ప్రాజెక్టు కాలేజీలోనే ఇంటర్ కూడా చేశారు. చిన్నప్పటి నుండీ చదువులో చురుగ్గా వుండే లక్ష్మీనారాయణ వరంగల్‌లోని ఆర్ఈసి కళాశాలలో ఇంజనీరింగ్, బెంగళూరులో ఎంటెక్, మద్రాసులో ఐఐటి పూర్తిచేశారు. తర్వాత సివిల్స్ రాసి టాపర్‌గా వచ్చినా ఐపిఎస్ ఎంచుకున్నారు. 1990 బ్యాచ్ అధికారిగా మహారాష్ట్ర కేడర్‌లో సర్వీసు ప్రారంభించారు. అనంతపురానికి చెందిన మేనత్త కూతురు ఊర్మిళను పెళ్లి చేసుకున్నారు.

వ్యవస్థాపక డైరెక్టర్ డిపి కోహ్లి

సిబిఐ వ్యవస్థాపక డైరెక్టర్ డిపి కోహ్లి. ఏప్రిల్ 1, 1963 నుండి మే 31, 1968 వరకు ఈ బాధ్యతలు నిర్వహించారు. అంతకుముందు కోహ్లి ఎస్‌పిఇకి ఐజి (ఇన్‌స్పెక్టర్ జనరల్)గా 1955 నుండి 1963 వరకు పనిచేశారు. 1955కు ముందు ఆయన మధ్య భారత్, ఉత్తర ప్రదేశ్, కేంద్ర స్థాయిల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎస్‌పిఇలో చేరకముందు ఆయన మధ్య భారత్‌లో పోలీసు చీఫ్‌గా వ్యవహరించారు. దేశానికి చేసిన గుర్తింపుగా కోహ్లిని భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది.

వివిధ విభాగాలు

"శ్రమ, నిష్పక్షపాతం, ఏకీకరణ" నినాదంతో పనిచేసే సిబిఐలో మూడు ప్రధాన విభాగాలున్నాయి.

అవినీతి నిరోధక విభాగం : దీని ప్రధాన కార్యాలయం ముంబయిలో వుంది. కేంద్ర ప్రభుత్వోద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో గల సంస్థలు, కేంద్ర ఆర్థిక సంస్థల్లోని వ్యక్తులకు సంబంధించిన అంశాలను స్వీకరిస్తుంది.

ఆర్థిక నేరాల విభాగం : బ్యాంకుల అవినీతి, మోసం ఆర్థిక నేరాలు, విదేశీ మారక ద్రవ్యం, దిగుమతి, ఎగుమతి రంగాల్లో నిబంధనల ఉల్లంఘన, మాదక ద్రవ్యాల, పురావస్తువుల, సాంస్కృతిక రంగాలకు చెందిన ఆస్తుల అక్రమ రవాణా (స్మగ్లింగ్), నిషిద్ధ వస్తువుల అక్రమ రవాణా తదితర అంశాలపై, నిధుల దుర్వినియోగం, భారీ నిధులు గల సంస్థల వ్యవహారాలకు సంబంధించిన అంశాలను స్వీకరిస్తుంది.

ప్రత్యేక నేరాల విభాగం : సంచలనాత్మక హత్యలు, కిడ్నాపింగ్‌లు, మాఫియా, అండర్ వరల్డ్ చేసే నేరాలు, వివిధ రాష్ట్రాల్లో కేంద్రీకృత (ఆర్గనైజ్డ్) గ్యాంగులు, ప్రొఫెషనల్ క్రిమినల్స్ చేసే నేరాలు. భారత ప్రభుత్వానికి చెందిన జప్తు చేసే వ్యవహారాలకు సంబంధించిన విభాగాల కేసులు, అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ కేసుల్లో అధికారుల ప్రమేయం వంటి అంశాలను స్వీకరిస్తుంది.

ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ర్యాంకు గల ఐపిఎస్ అధికారిని (80 శాతం మందిని) డిప్యుటేషన్‌పై జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తారు. 20 శాతం మందిని సిబిఐ డిపార్ట్‌మెంట్‌లో డిఐజిగా ఐదేళ్లు పనిచేసిన వారికి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తారు.

డిఐజి (గ్రూప్-ఎ : 39 పోస్టులు) : డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు స్థాయికి చెందిన ఐపిఎస్ అధికారిని డిప్యుటేషన్‌పై సిబిఐలో డిఐజి (75 శాతం మందిని)గా నియమిస్తారు. ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఇన్‌కమ్‌ట్యాక్స్, ఇండియన్ కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్) అధికారులు కూడా డిఐజిగా నియమితులవుతారు. 25 శాతం పోస్టుల్లో సీనియర్ సూపరింటెండెంట్‌గా సిబిఐలో నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసిన అధికారులను నియమిస్తారు. (సీనియర్ సూపరింటెండెంట్, ఎస్‌పి స్థాయిలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తిచేసి ఉండాలి)

ఎస్ఎస్‌పి (గ్రూప్-ఎ : 10 పోస్టులు) : డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా నాలుగేళ్ల రెగ్యులర్ సర్వీసు కలిగిన ఐపిఎస్ అధికారిని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా ప్రమోషన్ కల్పిస్తారు.

ఎస్‌పి (గ్రూప్-ఎ : 89 పోస్టులు) : 60 శాతం పోస్టులను ఐపిఎస్/ఐఎఎస్/ఐఎఎఎస్/ఐఆర్ఎస్‌కు ఎంపికైన వారిచే భర్తీ చేస్తారు. అందులో పది శాతం పోస్టులను ఎఐఎస్, ఐఎ అండ్ ఎఎస్/ఐఆర్ఎస్‌లకు చెందిన వారిచే భర్తీ చేస్తారు. మిగిలిన 40 శాతం పోస్టులను ఎఎస్‌పిగా ఆరేళ్లు రెగ్యులర్ సర్వీసు (మొత్తం 12 ఏళ్ల సర్వీసు) పూర్తి చేసిన అధికారులచే భర్తీ చేస్తారు.

ఎఎస్‌పి (గ్రూప్-ఎ : 75 పోస్టులు) : అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా 80 శాతం పోస్టులను డిపార్ట్‌మెంట్‌లో డిఎస్‌పిగా ఆరేళ్లు పూర్తిచేసిన అధికారులచే భర్తీ చేస్తారు. మిగిలిన 20 శాతం పోస్టులను డిప్యుటేషన్‌పై నియమిస్తారు.

డిఎస్‌పి (గ్రూప్-ఎ : 240 పోస్టులు) : 40 శాతం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు పోస్టులను డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్‌గా ఎనిమిదేళ్లు పూర్తిచేసిన అధికారులచే భర్తీ చేస్తారు. మరో 40 శాతం పోస్టులను కేంద్ర/రాష్ట్ర పోలీసు క్యాడర్ నుండి డిప్యుటేషన్‌పై భర్తీ చేస్తారు. మిగిలిన పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు.

ఇన్‌స్పెక్టర్ (గ్రూప్-సి : 755 పోస్టులు) : 50 శాతం పోస్టులను సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఐదేళ్లు పూర్తిచేసుకున్న అధికారులచే భర్తీ చేస్తారు. మిగిలిన 50 శాతం పోస్టులను కేంద్ర/రాష్ట్ర పోలీసు అధికారులను డిప్యుటేషన్‌పై నియమిస్తారు.

సబ్ ఇన్‌స్పెక్టర్ (గ్రూప్-సి : 381 పోస్టులు) : 50 శాతం పోస్టులను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. 25 శాతం పోస్టులను సీనియారిటీ, ఫిట్‌నెస్ ప్రాతిపదికన ఎఎస్ఐగా ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన అధికారులచే భర్తీ చేస్తారు. మిగిలిన 25 శాతం పోస్టులను డిపార్ట్‌మెంటల్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ద్వారా భర్తీ చేస్తారు. (గ్రూప్-బి పోస్టులను యుపిఎస్‌సి నిబంధనల ప్రకారం సిబిఐ డైరెక్టర్ భర్తీ చేస్తారు. సీనియర్ క్లర్క్ స్టెనోలు, ఎల్‌డిసిలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ మినహా మిగిలిన గ్రూప్-సి పోస్టులను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు భర్తీ చేస్తారు. గ్రూప్-సిలోని సీనియర్ క్లర్క్ స్టెనోలు, లోయర్ డివిజన్ క్లర్కులు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల పోస్టులను ఎస్‌పి స్థాయి అధికారి భర్తీ చేస్తారు.

న్యాయాధికారులు

లీగల్ అడ్వయిజర్ / డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌ను న్యాయశాఖ నియమిస్తుంది. అదనపు లీగల్ అడ్వయిజర్లు (6), డిప్యూటీ లీగల్ అడ్వయిజర్లు (20), సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (67), పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (96), అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (41) కూడా ఉంటారు.

స్టాఫ్ విభజన

వార్షిక రిపోర్టుల ఆధారంగా సిబిఐ స్టాఫ్‌ను మినిస్టీరియల్ స్టాఫ్, ఎక్స్ క్యాడర్ పోస్టులుగా విభజించారు. ఎక్స్ క్యాడర్ పోస్టుల్లో టెక్నికల్, ఎగ్జిక్యూటివ్ స్టాఫ్, ఇడిపి స్టాఫ్, హిందీ భాషా స్టాఫ్ (అధికార భాషా విభాగానికి చెందినది) ఉంటారు. మినిస్టీరియల్ స్టాఫ్‌లో ఎల్‌డిసి, యుడిసి, క్రైమ్ అసిస్టెంట్స్ మొదలైన వారు... ఎగ్జిక్యూటివ్ స్టాఫ్‌లో కానిస్టేబుల్స్, ఎఎస్ఐ, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లు... ఇడిపి స్టాఫ్‌లో డాటా ఎంట్రీ

సిబిఐ డైరెక్టర్లు

పేరు	కాలం
డిపి కోహ్లి	1963-68
ఎఫ్‌వి అరుల్	1968-71
డి సేన్	1971-77
ఎస్ఎన్ మాథుర్	1977 (యాక్టింగ్)
సివి నరసింహన్	1977 (యాక్టింగ్)
జాన్ లోబో	1977-79
ఆర్‌డి సింగ్	1979-80
జెఎస్ బజ్వా	1980-85
ఎంజి కాట్రే	1985-89
ఎపి ముఖర్జీ	1989-90
ఆర్ శేఖర్	1990 (యాక్టింగ్)
విజయ్ కరణ్	1990-92
ఎస్‌కె దత్తా	1992-93
కె.విజయ రామారావు	1993-96
జె సింగ్	1996-97
ఆర్‌సి శర్మ	1997-98
డిఆర్ కార్తికేయన్	1998 (యాక్టింగ్)
టిఎన్ మిశ్రా	1998-99
ఆర్‌కె రాఘవన్	1999-2001
పిసి శర్మ	2001-03
యుఎస్ మిశ్రా	2003-05
విఎస్ తివారి	2005-08
వివి అశ్విని కుమార్	2008-10
అమర్ ప్రతాప్ సింగ్	2010-ప్రస్తుతం కొనసాగుతున్నారు.



అమర్ ప్రతాప్ సింగ్

సిబిఐ శోధించిన కొన్ని ప్రధాన కేసులు

- బోఫోర్సు కేసు - 1986లో (అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రమేయం).
- కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో సంబంధమున్న హవాలా బ్రోకర్లు జాతీయ నాయకులకు భారీ ఎత్తున లంచాలు ఇచ్చిన కేసు (1991).
- దేశ భద్రతకు సంబంధించిన రహస్యాలను పాకిస్తానీ ఇంటెలిజెన్స్ ఏజెంట్లు అయిన ఇద్దరు మాల్దీవుల మహిళలకు విక్రయించిన కేసు (1994).
- 22 ఏళ్ల లా విద్యార్థి ప్రియదర్శిని మట్టూ హత్య కేసు (1999).
- ఉత్తర ప్రదేశ్‌లోని నిఠారీ గ్రామంలో డజన్ల కొద్ది చిన్నారులను హత్య చేసిన కేసు.
- కరాచీలో దావూద్ ఇబ్రహీంను అరెస్టు చేశారన్న మీడియా కథనాల ఆధారంగా సరైన సమాచారం అందించాలని పాకిస్తాన్‌లోని ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఎ)ను సిబిఐ కోరింది (2007).
- కేరళలోని కొట్టాయంలో గల సెయింట్ పాయిస్ కాన్వెంట్ హాస్టల్‌లో క్రైస్తవ సన్యాసిని సిస్టర్ అభయ హత్య కేసు (1992)
- గుజరాత్‌లో సొహ్రాబుద్దీన్ హత్య కేసు.
- మలంకారా వర్గీస్ హత్య కేసు (2002)
- భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసు
- కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణం
- 2జి కుంభకోణం
- ఓబుళాపురం మైనింగ్ అక్రమ రవాణా కుంభకోణం
- వైఎస్ జగన్ అక్రమాస్తుల వ్యవహారం

సిబిఐ అకాడమీ

సిబిఐ అకాడమీని ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో 1996లో నెలకొల్పారు. ఇది న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌కు 40 కిలోమీటర్ల దూరంలో, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి 65 కిలోమీటర్ల దూరంలో ఉంది. 26.5 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ అకాడమీలో పరిపాలన, అకడమిక్, హాస్టల్, రెసిడెన్షియల్ బ్లాక్స్ ఉన్నాయి. ఇక్కడ సిబిఐకి చెందిన అన్ని ర్యాంకుల అధికారులకు శిక్షణ ఇస్తారు. గతంలో సిబిఐలోని డిప్యూటీ ఎస్ఎస్‌పి, ఎస్ఐ, కానిస్టేబుల్‌లకు హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీసు శిక్షణా కేంద్రం, ఎన్‌పిఎలలో శిక్షణ ఇచ్చేవారు. ఘజియాబాద్ అకాడమీ నెలకొల్పిన తర్వాత శిక్షణను అక్కడికి మార్చారు.



ఆపరేటర్లు, డాటా ప్రాసెసింగ్ అసిస్టెంట్లు, అసిస్టెట్ ప్రోగ్రామర్లు, ప్రోగ్రామర్లు, ఎస్ఎస్ఎ ఉంటారు.

రాజకీయ ప్రభావాలు

సిబిఐకి అప్పగించే కేసులే తీవ్ర స్థాయిలోవై ఉంటాయి. ఉన్నత స్థానాల్లో వున్న వారికి చెందిన ఆరోపణలే దాని దాకా వస్తాయి. జాతీయ ప్రయోజనాలతో ముడిపడి ఉంటాయి. సాధారణంగా ఏ కేసైనా సంబంధిత రాష్ట్ర పోలీసులు రిజిస్టర్ చేస్తారు. అవసరాన్ని బట్టి కేంద్రం మధ్యవర్తిత్వంతో కేసులను సిబిఐకి బదలాయిస్తారు. సిబిఐ అత్యంత ప్రధానమైన కేసులను చేపడ్తుండటంతో వివాదాల సుడిగుండానికి దూరంగా ఉండలేని పరిస్థితి.పాలనా పరంగా సిబిఐ కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోనే వుంటుంది. కనక కాంగ్రెస్, బిజెపి లేక మరెవరు అధికారంలో వున్నా వారి ప్రభావం దానిపై పడుతుంటుందని ఆరోపణలు అనేకం వున్నాయి. తమ వారిని కాపాడటం, ప్రత్యర్థులను వేధించడం వంటివాటికి సిబిఐని వాడుకున్న ఉదాహరణలున్నాయి. అందులో అత్యంత వివాదాస్పదమైన కేసు బోఫోర్సు కేసు. ఈ విషయంలో కాంగ్రెస్ ఎక్కువ విమర్శలనెదుర్కొన్నా ఏడేళ్లు పాలించిన బిజెపి ఎన్‌డిఎలు కూడా తక్కువ తిన్నది లేదు.బిజెపి ప్రతిపక్షంలో వున్నప్పుడు వాజ్‌పేయి సిబిఐ స్వతంత్రంగా పనిచేయాలని వాదించారు. కాని ఆయనే ప్రభుత్వాధినేతగా తమను సమర్థించుకుంటూ మాట్లాడారు. బాబ్రీ మసీదు విధ్వంసం కేసులో నిందితుడుగా వున్న అద్వానీయే హోం శాఖ చేపట్టడంతో ఈ వ్యవహారం రంసకందంలో పడింది. తర్వాత సిబిఐ ఉపేక్షతో ఆయన కేసు నుంచి విముక్తుడయ్యారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు కేంద్ర మంత్రి అయిన మురళీ మనోహర్ జోషి కూడా దీనిపై నిరసన తెల్పుతూ రాజీనామా చేసి తర్వాత రాజీ పడ్డారు. అంటే ప్రతిపక్షంపైనే గాక తమలో తాము రకరకాలుగా సిబిఐని ప్రభావితం చేస్తుంటారని దీనివల్ల తెలుస్తుంది. ఆ సమయంలోనే మాయావతి, లాలూ యాదవ్ వంటివారిపై సిబిఐని ప్రయోగించినట్టు వివాదాలు నడిచాయి. గుజరాత్‌లో ఘోర నరమేధం జరిగినా విచారణ కమిషన్లను నియమించి సరిపెట్టిన నాటి కేంద్రం సిబిఐని ఉపయోగించుకోలేదు. తర్వాత యుపిఎ హయాంలో సోరాబుద్దీన్ ఎన్‌కౌంటర్ విషయమై సిబిఐ కోర్టు ఆదేశంతో జోక్యం చేసుకుంటే రాజకీయ కక్ష అని ఎన్‌డిఎ గగ్గోలు పెట్టింది. కాంగ్రెస్ కూడా తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకై ములాయం సింగ్‌ను తిప్పుకోవడానికి సిబిఐ ఆయుధాన్ని చూపించింది. ఈ విషయమై మెతక వైఖరిని తర్వాత న్యాయస్థానం తప్పు పట్టింది కూడా. అలాగే కేరళలో పి. విజయన్ పైనా ఎప్పుడో వీగిపోయిన అసత్య ఆరోపణను ముందుకు తెచ్చి ఇబ్బంది పెట్టడానికి విఫలయత్నం చేసింది. ఇలాంటి కారణాల వల్ల సిబిఐ రాజకీయ ఒత్తిడుల ప్రభావానికి లోనవుతోందని విమర్శలొస్తున్నాయి. ఆశ్రిత పక్షపాతం, దోషులను వదలిపెట్టడం, అవినీతికి పాల్పడిన ఆరోపణలు కూడా సిబిఐ అధికారులపై ఉన్నాయి. ఈ విషయాలను ఎవరో కాదు డైరెక్టర్‌గా పనిచేసిన జోగీందర్ సింగ్, జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన బిఆర్ లాల్ బహిర్గతం చేశారు. నిజాయితీ, నిబద్ధత గల అధికారిగా పేరొందిన బిఆర్ లాల్ తాను రాసిన పుస్తకంలో సిబిఐపై ఒత్తిడులు, విచారణను తప్పుదారి పట్టించిన విధానాన్ని ఉదాహరణలతో సహా ప్రస్తావించారు. ఈ సంస్థ అవినీతికి పాల్పడిందని సమాచార హక్కు చట్టం కింద సేకరించిన సమాచారంలోనే తేలింది. సంస్థ ఉన్నతాధికారులు నిధులను దుర్వినియోగం చేసిన తీరు బహిర్గతమైంది. సిబిఐ తప్పులను బయట పెట్టిన తనను వాళ్లు ముప్పుతిప్పలు పెట్టారని ఆర్‌టిఐ కార్యకర్త కృష్ణానంద్ త్రిపాఠి ఆరోపించారు. ఇప్పుడు సమాచార హక్కు చట్టం నుండి మినహాయింపు ఇవ్వడంతో సిబిఐ ఊపిరి పీల్చుకుంది. ఏదైనా కేసు సిబిఐ వద్దకెళ్తే అది కంచికి వెళ్లినట్లేనని ప్రజల్లో బలంగా నాటుకొని ఉంది. సిబిఐ వ్యవహారం కొండను తవ్వి ఎలుకను తవ్విన చందంగా ఉంటుందని అనుకుంటారు. సిబిఐ చేపట్టిన కేసులు ఇప్పటివరకూ ఆశించిన ఫలితాలనివ్వకపోవడమే దీనికి ప్రధాన కారణం. దేశ రాజకీయాలనే మలుపు తిప్పిన బోఫోర్స్ కుంభకోణం, వేలాది మంది మృతి చెందిన భోపాల్ గ్యాస్ దుర్ఘటన, నర హంతక నరేంద్ర మోడీ ప్రభుత్వంపై మచ్చగా ఏర్పడిన సొహ్రాబుద్దీన్ హత్యకేసు... ఇలా చెప్పుకుంటూ పోతే ఏ కేసులోనూ సిబిఐ దాని అంతు తేల్చలేదు. దీంట్లో తప్పు పట్టాల్సింది సిబిఐని కాదు. సిబిఐకి పరిధులు నిర్దేశించిన కేంద్ర ప్రభుత్వాన్ని. అధికార పార్టీ తమ రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టేందుకు కూడా సిబిఐ బూచిని ఉపయోగించుకుంటోందనే విమర్శలు కొల్లలు.

విమర్శలు ఎన్ని వున్నా... ఏ కేసులోనైనా అంతిమంగా సిబిఐ రంగంలోకి దిగాల్సిందే. ★

చిన్నకథ

మతాధికారి



ఆ రోజు ఆదివారం. క్రైస్తవ మతాధికారి క్లిజాని ఉదయాన లేస్తూనే కిటికీలోంచి ఆకాశం వైపు చూశాడు. ఆకాశమంతా నీలం రంగులో ఉంది. ఒక్క చిన్న మేఘం కూడా లేదు. అయితే, రైతులకు వర్షం అత్యవసరంగా వుంది. పంటలు ఎండిపోయే పరిస్థితి. వారు ఎంతో ఆశగా వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. అందుకోసం చర్చిలో జరిగే మతపరమైన అన్ని కార్యక్రమాల్లో, ప్రార్థనల్లో పాల్గొంటుండేవారు. అయినా దేవుడు వారిని కరువుతో శిక్షించాలనుకున్నాడేమో!

పాస్టర్ క్లిజాని వారితో "మీరేమీ బాధపడవద్దు. వర్షాన్ని కురవమని దేవుడే ఆజ్ఞాపిస్తాడు" అని రైతులకు భరోసా ఇచ్చాడు.

పాస్టర్ వయస్సు నలభై పైనే ఉంటాయి. పెళ్లి చేసుకోవాలని ప్రణాళిక కూడా తయారు చేశాడు. లూసిస్ అనే భూస్వామి కూతురు మాలే పై మనసుపడ్డాడు. నిజంగానే ప్రేమిస్తున్నాడు కూడా. పెళ్లికోసం ఇంట్లో సరంజామా కొనడానికి 64వేల రూపాయలు అప్పు తీసుకున్నాడు.

అది సెయింట్ జాన్స్ డే. భక్తులు చాలామంది హాజరయ్యారు. ఫాదర్ చర్చికి బయల్దేరుతూ ఆకాశంవైపు చూశాడు. ఒక్కసారిగా ఆకాశమంతా మబ్బులతో నిండిపోయింది. 'రైతులకు అవసరమైన వర్షం కోసం నేను దేవుణ్ణి ప్రార్థించాలనుకున్నాను. కానీ ముందే అది రావడం సహించను" అనుకున్నాడు. అయితే వర్షం రావడం తన కోరిక కాబట్టి చల్లబడ్డాడు. "దేవుడు నా మనసు అర్థం చేసుకున్నాడు. దేవుడే సూర్యుణ్ణి వెలుతురివ్వాలని, వాయువుని వీచాలని, వర్షాన్ని కురవాలని ఆదేశిస్తాడు" అని సమాధానపడ్డాడు.

పాస్టర్ చర్చిలోకి ప్రవేశించిన కొద్దిసేపటికి పార్థన ముగిసింది. శిలువ దగ్గరకెళ్లి చర్చినంతా కలియజూశాడు. తను కోరుకున్న వ్యక్తి లూసిస్, ఆయన భార్య, కూతురు ముందు వరుసలో కుడివైపున కూర్చున్నారు. మాలే గోడవైపు అదేపనిగా చూస్తోంది. ఆమె తన వైపు చూడనందుకు పాస్టర్ చిన్నబుచ్చుకున్నాడు. ఆమెను ఇంట్లో మందలించాలనుకున్నాడు. బయట పెనుగాలికి నిమ్మచెట్లు ఊగిపోతున్నాయి. లోపల సంగీతం ఆగిపోయింది. బయట ఉరుములు, మెరుపులు తీవ్రమయ్యాయి. వర్షం కూడా మొదలైంది. అక్కడున్నవారంతా కిటికీల వైపు చూస్తున్నారు. వారి ముఖాలు ఆనందంతో మెరిసిపోతున్నాయి. ఫాదర్‌పై వారికున్న నమ్మకం ఇంకా పెరిగింది. దాంతో ఆయన ముఖం అమితానందంతో వెలిగిపోయింది. ప్రతి నిముషం వర్షం మోత పెరుగుతోంది.

అకస్మాత్తుగా భూస్వామి లూసిస్ తన బైబిల్ పుస్తకాన్ని కూతురు మాలె ఒడిలో పెట్టి నిల్చున్నాడు. పక్క వారందర్నీ తోసుకుని వడివడిగా నడుచుకుంటూ బయటికెళ్లాడు. ఎందుకంత వేగంగా వెళ్తున్నాడో ఆయన భార్యకు గానీ, కూతురికి గానీ అర్థం కాలేదు. వారూ ఇతరుల మాదిరిగా లూసిస్ వెళ్లిన వైపే కళ్లార్పకుండా చూస్తుండిపోయారు. పాస్టర్ ఆందోళనతో ప్రార్థనాసేవను అర్థాంతరంగా ముగించాడు. సాధారణంగా సేవలు పూర్తవగానే పాస్టర్‌తో కొంతసేపు ముచ్చట్లు పెడతాడు లూసిస్. ఆ తర్వాతే పాస్టర్ ఇంటికెళ్లేవాడు.

వర్షం ఆగిపోయింది. లూసిస్ బయట ఏం చేస్తున్నాడో వెళ్లి చూడమని తన శిష్యుడ్ని పురమాయించాడు పాస్టర్. అతను తిరిగివచ్చి లూసిస్, అతని గుర్రం కనిపించలేదని చెప్పాడు. ఏమైందో పాస్టర్‌కి అర్థం కాలేదు. బాగా కోపం వచ్చింది. ఆ ముసలి లూసిస్ చెప్పకుండా పోయినందుకు బుద్ధి చెప్పాలనుకున్నాడు. ఒక పాస్టర్ అల్లుడిగా దొరకడం ఎప్పుడో గానీ జరగదు. అలాంటిది తనకు చెప్పకుండా వెళ్తాడా? బహుశా తను కొన్న సరంజామా చూడ్డానికి వెళ్లుండవచ్చు. అయితే మాత్రం పిచ్చివాడిలా ప్రవర్తించి చర్చి సేవలకు అంతరాయం కలిగించి దురుసుగా వెళ్లిపోతాడా! లేదు. అతన్ని శిక్షించాల్సిందే! అనుకున్నాడు.

పాస్టర్ ఇంటికెళ్లి చూస్తే ఎవరూ లేరు. టోపీ, చేతికర్ర తీసుకుని లూసిస్‌కి ఏమైందో తెలుసుకునేందుకు అతనింటికెళ్లాడు. ఆ ఇంటిముందు కుక్కలు వెంటబడ్డాయి. వాటిని కర్రతో కొట్టి తప్పించుకుని వాకిట్లోకెళ్లాడు. లూసిస్ భార్య తనను గమనించి కూడా పలుకరించకుండా లోపలికెళ్లింది. అది ప్రత్యక్ష అవమానం. లోపల హాల్లోకెళ్లి చూస్తే ఇంటి యజమాని లూసిస్, సోఫాలో కాళ్లు చాపి కూర్చుని వార్తాపత్రిక చదువుతున్నాడు. పాస్టర్ శబ్దం చేస్తూ ఒక కుర్చీలాగి ఆయన పక్కనే కూర్చుని "నమస్తే" అని పలుకరించాడు.

అయినా ఆ భూస్వామి కదల్లేదు. అలాగే పేపర్ చదువుతూ ఉండిపోయాడు. పాస్టర్ ఆశ్చర్యంతో తికమక పడ్డాడు. పక్కగదిలో నుండి అతని కూతురు మాలే మాటలు, నవ్వులు వినిపించాయి.

"మంచి వర్షం వచ్చింది కదూ" అంటూ సంభాషణ మొదలు పెట్టాడు. భూస్వామి ఒక్క ఉదుటన లేచి కూర్చుని "నీకు సంతోషంగా ఉంది కదూ!" అన్నాడు.

ఆకాశం నుండి భూమికి ఒక్కసారిగా దిగజారినట్లనిపించింది పాస్టర్‌కి. "అంటే నీకు...."

లూసిస్ సోఫా నుండి దిగ్గున లేచి పాస్టర్ వైపు ఉరిమి చూస్తూ "నువ్వు ఇక్కడికెందుకొచ్చావ్. నన్ను పరిహాసం చేయడానికా? నాతో రా, నువ్వు ఎంత మంచి పని చేశావో చూద్దువుగాని" అన్నాడు యజమాని.

పాస్టర్‌ను కొంత దూరం తీసుకెళ్లి ఓ వైపు చూపిస్తూ "నువ్వు ఏం చేశావో ఒక్కసారి అటు చూడు?" అన్నాడు.

పాస్టర్ అంతా చూశాడు. ఎండబెట్టిన లవంగాలు, గడ్డివాములు అన్నీ బురద నీళ్లలో మునిగిపోయాయి. పాస్టర్ బాధతో తల వంచుకుని "నిజంగా ఇది దురదృష్టకరమే!" అన్నాడు.

"దురదృష్టం కాదు. సర్వనాశనం. దివాలా తీయడం" అన్నాడు లూసిస్.

పాస్టర్ విపరీతమైన దుఃఖంతో తనను తాను నేరస్థుడిగా భావించుకుని "నాకు ఎలా తెలుస్తుంది. అందరూ వర్షం కావాలని కోరుకున్నారు"

"అంటే వాళ్ల మాటలు విన్నావన్నమాట. మా గురించి ఆలోచించలేదు. రేపటి వరకు వేచి ఉండవలసింది. ఆ సమయం మాకు సరిపోయేది" అన్నాడు యజమాని లూసిస్.

"అతనికేం. మన సంపద మొత్తం పోయినా అతనికి లెక్కేలేదు. వర్షాన్ని కురవమని ఆదేశించి మనల్ని సర్వనాశనం చేశాడు" అంది యజమాని భార్య.

పాస్టర్ కూడా కోపంతో "ఏం మాట్లాడుతున్నావ్. ఎవరికి కావాల్సింది వారికిచ్చే శక్తి నాకుందని అనుకుంటున్నావా?" అన్నాడు.

"ఓహో! అలాంటిదేమీ లేదన్నమాట. అయితే నిన్ను ఇక్కడ పాస్టర్‌గా నియమించడంలో ఉద్దేశ్యం ఏంటి? చర్చిలో డంబాలు పలకడమెందుకు? నటించడానికి అదొక థియేటర్ అనుకున్నావా?" లూసిస్ అన్నాడు.

ఈ మాటలతో పాస్టర్ గొంతు పూడుకుపోయింది.

"అతనితో మాట్లాడి ఉపయోగమేంటి? అతను పాస్టర్‌గా కనిపించినా నిజానికి పూర్తిగా బందిపోటు తప్ప మరేం లేదు" అంది భార్య.

"అతనితో మాట్లాడ్డం వల్ల ఉపయోగమేమీ లేదు. అతన్ని నరకానికి పోనియ్యి. కానీ అతని ముఖం మళ్లీ మనకు చూపించకూడదు" యజమాని అన్నాడు.

పాస్టర్‌ను బయటికి నెట్టి తలుపు దబాల్న వేశారు. బయటపడ్డ పాస్టర్ కుక్కలతో పోరాడుతూనే, ఆపిల్ తోటలో ప్రియుడు స్వూరాతో మాలే ఆనందంగా మాట్లాడ్డం గమనించాడు. ఆమె హృదయం ఎవరిపైనుందో అర్థమైంది.

ఆ తర్వాత 64 వేల రూపాయలు అప్పుచేసి సామాను కొనడం, ఇంటికోసం 20 వేల రూపాయల అడ్వాన్స్ ఇవ్వడం వంటి ఇతర సమస్యలతో కూడిన ఆలోచనలు అతని మెదడుని అల్లకల్లోలం చేశాయి.

ఉరుములతో కూడిన ఆకాశం లోంచి పోయి తడిసి ముద్దయినట్లు పాస్టర్ భావించుకున్నాడు.

రష్యన్ రచయిత : **ఆండ్రెజ్ ఉటిప్స్**

అనువాదం : **డి.ఆర్.కె.రెడ్డి**



పరీక్షల్లో ఫెయిల్ అయినా, వ్యాపారంలో నష్టం వచ్చినా, భాగస్వామితో బేధాభిప్రాయం వచ్చినా, చేసేపనిలో అసంతృప్తి మొదలైనా, ఆరోగ్య సమస్యలు తలెత్తినా, ఒంటరితనం వెక్కిరించినా కొందరు ఆత్మహత్యను పరిష్కార మార్గంగా ఎంచుకుంటున్నారు. కానీ సమస్యకు 'అదే' పరిష్కార మార్గమా! 'ఇంకేమీ' లేదా! మనసుంటే మార్గాలుండవా?!

ఆత్మహత్యే పరిష్కారమా?

- సి.వి.సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

తాము ఎంతో ప్రేమించే కుటుంబ సభ్యులను నెమ్మదిగా మాటలతో ఒప్పించి ఆత్మహత్యలకు పాల్పడుతున్న కుటుంబాల గురించి మనం వార్తాపత్రికల్లో, టీవీల్లో చూస్తున్నాం. వీరంతా తమ జీవితాలకు లేదా తమ పిల్లల జీవితాలకు ఎటువంటి విలువనూ ఇవ్వడం లేదు. పెద్ద పెద్ద నగరాల్లో ఆత్మహత్యల రేటు పెరిగిపోతోంది. మన దక్షిణ భారతదేశంలో ఉత్తరాది కన్నా ఎక్కువ ఆత్మహత్యలు జరుగుతున్నాయి. దీనికి కారణం దక్షిణ భారతదేశంలో అక్షరాస్యత అధిక స్థాయిలో ఉండడమేనని అంటున్నారు. విద్యార్హతలు పెరిగేసరికి ఉన్నతావకాశాలు వస్తాయని ఎదురు చూస్తారు. వారి ఆశలు నెరవేరకపోవడంతో ఇటువంటి ఘాతుకానికి పాల్పడుతున్నారు. మరికొంతమందిలో ఒంటరితనం, ఉద్యోగపు ఒత్తిళ్లు, సామాజిక - ఆర్థిక సమస్యలు, ఇతరుల మీద విశ్వాసం లేకపోవడం వంటి కారణాలతో వ్యాకులతకు గురవుతున్నారు.

వ్యాకులత అంటే?

వ్యాకులత అంటే డిప్రెషన్. మనిషిలో దుఃఖం, పనికిమాలిన వారనే భావం, ఆకలి లేకపోవడం, నిద్ర పట్టక పోవడం, నిరుత్సాహంగా ఉండడం దీని లక్షణాలు. ప్రపంచం మొత్తం ఉత్సాహంగా ఉరకలు వేస్తుంటే వ్యాకులత చెందిన మనిషి నిరుత్సాహంగా విచారంతో ఉంటాడు. ఈ లక్షణాలు ఎవరిలోనైనా పగటిపూట కూడా రెండు వారాలకు మించి కనిపిస్తే వెంటనే ఆ వ్యక్తిని కౌన్సిలింగ్‌కు, వైద్య చికిత్సకు తీసుకువెళ్లాలి.

వ్యాకులతకు కారణాలేంటి? ప్రస్తుత ప్రపంచంలో మనిషి ప్రతి విషయాన్ని లాభదృష్టితో చూస్తున్నాడు. తాను ఆశించిన, లేదా అనుకున్న ఫలితాలు రాకపోతే వ్యాకులత చెందుతున్నాడు. జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేమని ఆందోళన చెందుతారు. కోరుకున్నవి సాధించినంత కాలం జీవితాన్ని ఆస్వాదిస్తూ తమని తాము ప్రేమించుకుంటారు. అలాకాకపోతే జీవితం మీద విరక్తి మొదలవుతుంది. ఈ మధ్య వార్తాపత్రికల్లో ఒక వార్త వచ్చింది. పంతొమ్మిదేళ్ల కొడుకు తల్లిదండ్రులను కారు కొనిపెట్టమని అడిగాడు. వారు నిరాకరించడంతో సీసాడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు మరణాన్ని తట్టుకోలేక తల్లిదండ్రులూ ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. ఇటువంటి సంఘటనలు మనసుల్లో గొప్ప అలజడిని సృష్టిస్తాయి.

సవాళ్లతో కూడిన జీవితం

జీవితసమరంలో ఎన్నో సవాళ్లు, విజయాలు, వైఫల్యాలు వుంటాయి. ఎప్పుడూ విజేతగా ఉండిపోవాలంటే సాధ్యమా? మన ఇష్టాయిష్టాల ప్రకారం జీవితం సాగడం లేదని, దానికి పరిష్కారం ఆత్మహత్య అనుకోవడం చాలా తప్పు. పొరపాట్లు ఎక్కడ జరిగాయి? పరాజయం వెనుక కారణాలను విశ్లేషణ చేసుకుని, భవిష్యత్తులో అటువంటి పొరపాట్లు జరక్కుండా జాగ్రత్త పడడం అలవరచుకోవాలి.

ఒకగదిలోకి దుర్వాసన వస్తుంటే ఆ గదిని వాడడం మానేస్తామా? ఎక్కడ్నుండి ఆ వాసన వస్తుందో కనుక్కుంటాం. ఇంకేముంది? దుర్వాసన రాకుండా ఏం చెయ్యాలో మనకు తెలుసు. జీవితాన్ని కూడా ఇదే విధంగా సవరించుకోవాలి.

విచారం రుచి తెలిసిన వారే సంతోషాన్ని సంపూర్ణంగా అనుభవించగల్గుతారు. ఏ ఒక్కరి జీవితంలోనూ సుఖసంతోషాలు మాత్రమే నిండి ఉండవు. సుఖదుఃఖాలు జీవితంలో ఎత్తుపల్లాలు. ఓటమి రాగానే సర్వం కోల్పోయినట్లేనని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుకోకూడదు.

వ్యతిరేకత మనిషికి ఎంతో అవసరం. ఇది మనిషికి బోలెడంత వివేకాన్ని, అవగాహనని కలిగిస్తుంది. అనుభవాన్ని ఇస్తుంది. కోటీశ్వరుడు సంతోషంగా జీవిస్తున్నాడని ఊహించకూడదు. ఒంటరితనం, అనారోగ్యం, నమ్మకమైన వ్యక్తులు, ఆత్మీయనేస్తాలు దొరక్క అతడు నిత్యం బాధపడుతుండవచ్చు. మనిషికి శారీరక, మానసిక సంతోషాలున్నప్పుడే సంతృప్తిగా ఉంటాడు. ఇది సాధించాలంటే కోరికలను అదుపులో ఉంచుకోగలగాలి. మనసులో కోరికలు సూక్ష్మజీవులు పెరిగినట్లు పెరిగి మనిషిని దురాశాపరుణ్ణి చేస్తాయి. అలాంటి వారు సంపాదనతో సంతోషం లభిస్తుందనుకుంటారు. ఇతరుల విజయాల పట్ల అసూయతో, వ్యతిరేక భావంతో ఉంటారు. కొంచెం సాహసం అలవరచుకుంటే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించగలుగుతారు. పిరికితనానికి చోటిచ్చి ఆత్మహత్య చేసుకుంటే వారు జీవితంలో ఏం సాధించినట్లు?

ఇవి అవసరం

♦ ఎవరైనా మానసికంగా నలిగిపోతూ, విచార సముద్రంలో మునిగిపోతుంటే స్నేహితులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ♦ వ్యాపారంలో నష్టపోయి, అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకునేవారుంటారు. ఇటువంటివారిని భాగస్వామి పసిగట్టి వారికి తగిన మానసిక ధైర్యం ఇచ్చి, మళ్లీ కొత్త వ్యాపారం ప్రారంభించేటట్లు ప్రోత్సహించాలి. ♦ నిరంతర శ్రమ, ప్రణాళికలు విజయాలను తెచ్చిపెడతాయి. చిన్న చిన్న వైఫల్యాలుంటాయి. వాటికి బెదిరి ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం పిరికితనమనే విషయం సమయం చిక్కినప్పుడల్లా వివరిస్తుండాలి. ♦ 26 ఏళ్ల కూతురు మరణిస్తే తల్లిదండ్రులు కుంగిపోతే ఎలా? కడుపున పుట్టినవారు చనిపోతే బాధ కలగడం సహజం. కానీ పుట్టిన ప్రతిజీవీ గిట్టక మానదు. జననమరణాలు నిరంతరం జరుగుతుంటాయి. అవి సృష్టి నియమాలు. అయితే కుమార్తె జ్ఞాపకాలు ఎప్పుడూ తమతోనే వుంటాయని సమాధానపడాలి. ఇలాంటి ధోరణులు అలవరచుకుంటే ఆత్మహత్య ఆలోచన రాదు. ♦ ఓటమిని ఎదుర్కోగల ధీరోదాత్తత తల్లిదండ్రులు పిల్లలకు నేర్పాలి. వారిలో ఆత్మవిశ్వాసం పెరిగే విధంగా ప్రవర్తించాలి. ♦ అపజయాలు విజయానికి సోపానాలనే విషయం యువతలో నాటుకునే విధంగా చెప్పాలి. ♦ ఆత్మహత్య అనేది జబ్బు కాదు. అదొక ప్రవర్తనా సమస్య. ♦ 'చావాలని లేదు. కానీ బతకాలనీ లేదు' అనే సందిగ్ధతతో కొందరుంటారు. నచ్చజెప్పే వారుంటే క్షణికోద్రేకంలో తీసుకునే నిర్ణయాల నుండి వీరు బయటపడతారు. ★

స్ఫూర్తినిచ్చే స్వాతంత్ర్య సంగ్రామ నేపథ్యం



వ్యాపార నిమిత్తం మన దేశానికి వచ్చి కపటోపాయాలతో పాలనాధిపత్యం చేజిక్కించుకున్న ఆంగ్లేయులు తమ దోపిడీని యథేచ్ఛగా సాగించారు. వ్యక్తిగత, సామాజిక, సాంస్కృతిక, మత, రాజకీయ స్వేచ్ఛను హరించి శతాబ్దాలపాటు భారతీయులను ఎన్ని రకాలుగా దోపిడీ చేయవచ్చో అంతకన్నా ఎక్కువగానే దోచుకున్నారు. కాగా భారతీయులు చైతన్యవంతులై 1857లో వీరిని దేశం నుంచి పారదోలడానికి సమరం చేశారు. తొలి స్వాతంత్ర్య సంగ్రామంగా పేరు పొందిన ఈ కీలక ఘట్టానికి దారితీసిన పరిస్థితులు, పరిణామాలను ముఖ్యంగా మద్రాసు ప్రెసిడెన్సీ, హైదరాబాద్ ప్రాంతపు పరిస్థితులను కళ్లకు కట్టినట్లు తెలుపుతుందీ పుస్తకం. ఉదాహరణకు...కొన్ని... మతప్రచారం కోసం వచ్చిన క్రైస్తవ మతప్రచారక సంఘాలైన మిషనరీ సొసైటీలు, క్రైస్తవ మత బోధకులు పాఠశాలలు స్థాపిస్తూ హిందూ, ముస్లిం యువకులను ఎలా తమ మతంలోకి మార్పించారో 'దేవాలయాలకు క్రైస్తవ మత ధర్మకర్తలు', 'విద్యాబోధనలో మత ప్రచారం' అనే టాపిక్‌ల కింద చెబితే, ఇది రేపిన గందరగోళాన్ని 'చెన్నపట్నం ప్రజల సంక్షోభం' చాప్టర్‌లో చదవవచ్చు. వీరి దోపిడీ పాలన వలన దేశీయులు జీవనానికి ఆలంబనగా ఉన్న చేతివృత్తులు, వ్యవసాయం, కుటీరపరిశ్రమలు వంటివి మూతబడి, సమాజం సంక్షోభాల నుంచి ప్రజలను బయట పడేయడానికి గాజుల లక్ష్మీనరసు సెట్టి స్థాపించిన మద్రాసు నేటివ్ అసోసియేషన్, ఏనుగుల వీరాస్వామయ్య వంటి వారు స్థాపించిన హిందూ లిటరరీ సొసైటీ తదితర ప్రజా సంఘాలు చేసిన మేలును 'ప్రజా సేవకులు స్వధర్మ రక్షణము' అనే పాఠం వివరిస్తుంది. ఇదేవిధంగా రైతులను ఆర్థికంగా దిగజార్చిన రైత్వారీ పద్ధతి, దిట్టం తదితర పేర్లతో చివరకు ఎడ్లబండ్లు, ఎడ్లను కూడా వదలకుండా శిస్తు విధించారు. వసూలు కోసం తాసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, పోలీసులు రైతులపై అక్రమ కేసులు బనాయిస్తూ శిక్షించే వైనాలను తెలుపుతుంది 'రైత్వార అమరకం' చాప్టర్. ఉప్పుపన్ను కట్టలేని పేదలు ఉప్పు మానేసేవారు. కొందరు ఉప్పగా ఉండే చవుడు మట్టిని జల్లెడపట్టి వాడుకునే వారు. అయితే బ్రిటీషు దుర్మార్గ పాలకులు 'సర్కారు తయారు చేయించే ఉప్పు తప్ప మరో ఉప్పును వాడకూడదంటూ ఇలాంటి వారిపై జరిమానాలు విధించడం, దెబ్బలు కొట్టి శిక్షించే ఘటనల వంటి ఎన్నో ఆంగ్లేయుల అకృత్యాలను గురించి ఈ పుస్తకం మనకు సోదాహరణంగా తెలుపుతుంది. బ్రిటిషు వారు కొనసాగిస్తున్న ఇలాంటి దోపిడీ, దౌర్జన్యకాండపై అవగాహన పెంచుకున్న ప్రజలు చైతన్యవంతులై వారిని దేశం నుంచి పారదోలడానికి జాతీయ స్వాతంత్ర్య సంగ్రామం చేయడానికి దారి తీసిన ఇలాంటి ఎన్నో పరిణామాలను తెలియజెప్పిన ఈ పుస్తకం 1857లో జరిగినది 'జాతీయ సమరమా? కాదా?' అనే వివాదానికి కూడా అది జాతీయ స్వాతంత్ర్య సంగ్రామమే అని జవాబు చెప్పి ఒక వివాదానికి తెర దించింది. ప్రపంచీకరణ, సరళీకరణ పేరుతో అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాలను ఎదిరించాల్సిన అవసరం కలిగిన ప్రస్తుత తరుణంలో అలనాటి సంగ్రామానికి దారితీసిన పరిస్థితులు, పరిణామాలను తెలుసుకోవాలి. ఈ చారిత్రక పరిణామాలను చక్కగా అందించే పుస్తకమైన దీనిని ప్రతి ఒక్కరూ చదివి తీరాల్సిందే..!!

ప్రథమ జాతీయ స్వాతంత్ర్య సమరం 1857 : పూర్వరంగములు,
రచన : దిగవల్లి వేంకటశివరావు, పేజీలు : 130, వెల : రూ. 60/-,
ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

- ఎన్. మదనయ్య

కొత్త పుస్తకాలు

ఆ... అక్షర చూపు రేపటి ప్రగతి వైపు

డా॥సి.నారాయణరెడ్డి గారి ఈ కవితా సంపుటి రేపటి ప్రగతివైపు చూపు సారింపజేస్తుంది. మొత్తం 80 కవితల్లో దాదాపు చాలా వరకు మానవతా కోణాన్ని విశ్లేషిస్తాయి. ప్రతి కవితలో వస్తు నవ్యత, మానుషత్వీకరణ, జీవన సత్యాలు ఆవిష్కరించారు. శైథిల్యం పాత గోడలకే గానీ, ఆలోచనలకు రావద్దు అనే కవి సృజన నిర్ధారణవ్యవస్థను మేల్కొనేటట్లు చేస్తుంది. కొన్ని కవితలు మనల్ని జాగృతం చేస్తాయి. వాటిల్లో కొన్ని "నా మనసులో రకరకాల మెరుపులొస్తుంటాయి. వాటిని అక్షరాల్లోకి ఎక్కించినప్పుడే నాలో సరికొత్త ఉద్దీప్తి పుడుతుంది" (సృజనయాగం – పేజీ1) అంటారు కవి. పీడిత జాతుల్లా అణగారి వున్న ఆర్తనాదాలు, ఉవ్వెత్తున ఎగిసి, పాలక వర్గాల గద్దెలను కంపింపజేసే విప్లవ ఘోషలవుతాయి (పరిణామ స్వరూపాలు – పేజీ 8). లోకంలో ప్రతి ప్రాణికి ఆశ అవసరం, అది దురాశగా మారితే మాత్రం సృష్టి స్థితికే అరిష్టం (ఆశ –పేజీ24). ఎండా వానా, పక్షులూ ఆకులూ కలసి ఆడుకున్న ఆ సయ్యాటలు మానవాళి సమైక్య భావుకతకు మార్గదర్శకాలు (అవీ సయ్యాటలంటే – పేజీ43). ప్రగతిశీల కవితల ఒడిలో జన బాహుళ్యం అడుగుల సవ్వడిలో (ఇంకెక్కడుంటాను – పేజీ 58). రక్తసిక్త పాదాలతో దాన్ని చేరుకున్నాను. "ఆ దృశ్యానికి విశ్రాంతి పొందిన భవిష్యత్తు తల వంచుకుని తానే నా పాదాల ముందు వాలిపోయింది" అంటారు. "నా చూపు రేపటి వైపు" (పేజీ 86) కవితలో ఎంతో తాత్వికత కనిపిస్తుంది. మాతృహృదయం, శ్వాస పయనించినంత కాలం, నదీహృదయం, నాలుగు వైపుల నుండి ఎగిరిపోయిన జ్ఞాపకం, హద్దు దాటితే అంతే, దూరాలను తరిమేసి, ఏకాంతం, కాలం గీసిన రేఖ, నడుస్తూ నడిపించే కాలం, కాలజ్ఞత, మట్టి పరిమళాలు, అదీ నా చిరునామా... కవితలు పాఠకుణ్ణి ఆలోచింపజేస్తాయి. బ్రతుక్కి మార్గదర్శకం చేస్తాయి. సూక్ష్మ చక్షువులతో చదివి చూడాలి.

నా చూపు రేపటివైపు (కవితా సంపుటి), రచన : డా॥సి.నారాయణరెడ్డి,
పేజీలు : 168, వెల : 150/-, ప్రతులకు : విశాలాంధ్ర, నవోదయ బుక్‌హౌస్.

- తంగిరాల చక్రవర్తి



200 వింత ప్రశ్నలు
విచిత్ర జవాబులు
సంకలనం : పి. రాజేశ్వరరావు
పేజలు :114, వెల : 50/-,
ప్రతులకు : 12 విశాలాంధ్ర బుక్ హౌసులు.
వారి వ్యాన్లు, పుస్తక ప్రదర్శనలు మరియు
ప్రముఖ పుస్తక విక్రేతలు.



ఎవరీ ఛత్రపతి శివాజి
గోవింద్ పన్సారే
పేజలు :83, వెల : 25/-,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్,
విజ్ఞాన భవన్, 4-1-435, బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాద్,
మరియు
విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు.





బనానా బోండా

కావలసిన పదార్థాలు

మైదా - 1 1/2 కప్పు
అరటి పండు - 1 పెద్దది
పంచదార - 4 టేబుల్ స్పూన్లు
కొబ్బరి తురుము - 2 టేబుల్ స్పూన్లు
నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు
నూనె - వేయించడానికి సరిపడా
యాలకుల పొడి - చిటికెడు

తయారు చేసే విధానం

కొబ్బరి తురుము దోరగా వేయించాలి. అరటి పండు తొక్క తీసి మెత్తగా చిదమాలి. అందులోనే మైదా, పంచదార, యాలకుల పొడి, వేయించిన కొబ్బరి తురుము వేసి కలపాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి బోండాల పిండిలా కలపాలి. చిన్న చిన్న వుండలు చేసుకుని కాగిన నూనెలో వేయించాలి. అంతే వేడి వేడి బనానా బోండా రెడీ.



బీట్‌రూట్ సూప్

కావలసిన పదార్థాలు

బీట్‌రూట్ - 1
ఉల్లిపాయ - 1
క్యారెట్ - 1
వెల్లుల్లి - 4 రెబ్బలు
టమాటా - 1
(ఉడకబెట్టి గుజ్జు చేయాలి)
ఉప్పు - తగినంత
నెయ్యి - 1 టీ స్పూన్.
కార్న్‌ఫ్లోర్ - 4 టీ స్పూన్లు
కొత్తిమీర - గార్నిష్‌కి సరిపడా

తయారు చేసే విధానం

బీట్‌రూట్, క్యారెట్ తురిమి పెట్టుకోవాలి. బాండీలో నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో కచ్చాపచ్చాగా నూరిన వెల్లుల్లి, టమాటా గుజ్జు, ఉప్పు వేసి వేయించాలి. తర్వాత రెండు గ్లాసుల నీళ్ల పోసి మరిగించాలి. అందులోనే బీట్‌రూట్, క్యారెట్ తురుము, ఉల్లిపాయ ముక్కలు వేసి ఉడికించాలి. కొద్దిగా నీళ్లలో కార్న్‌ఫ్లోర్ వేసి పేస్ట్ చేయాలి. దీన్ని మరుగుతున్న మిశ్రమంలో కలపాలి. ఇది అడుగంటకుండా ఓ ఐదు నిమిషాలు కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం కొద్దిగా చిక్కబడ్డాక దించేయాలి. చల్లారిన తర్వాత కొత్తిమీరతో గార్నిష్ చేసి అందిస్తే సరి. రుచికరమైన బీట్‌రూట్ సూప్ తయారైనట్లే.

కట్ రోల్స్

కావలసిన పదార్థాలు

మైదా పిండి - రెండు కప్పులు, ఎండు మిర్చి - 5
జీలకర్ర - 2 స్పూన్లు, చింతపండు - కొద్దిగా
ఉప్పు - తగినంత, నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

మైదాలో కొంచెం ఉప్పు వేసి చపాతీ పిండిలా కలిపి అరగంట నానబెట్టాలి. బాండీలో రెండు చెంచాల నూనె వేసి జీలకర్ర, ఎండుమిర్చి, చింతపండు, ఉప్పు వేయించాలి. చల్లారాక మిక్సీలో మెత్తగా పొడి చేయాలి. ముందుగా కలిపి పెట్టుకున్న మైదాపిండిని చిన్న చిన్న ఉండలు తీసుకుని చిన్న చపాతీలా చేయాలి. దాని మధ్యలో పొడి వేసి మొత్తం సమంగా రాసి రోల్‌లా చుట్టాలి. ఈ చపాతీని రెండు అంగుళాల పొడవు చొప్పున ముక్కలు కోసి నూనెలో వేయించుకోవాలి. నోరూరించే కట్‌రోల్స్ సిద్ధం. టమాటా సాస్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి.



కొబ్బరి ఆలూ రైస్

కావలసిన పదార్థాలు

బియ్యం - 2 కప్పులు
పచ్చికొబ్బరి తురుము - అరకప్పు
బంగాళదుంపలు - 4
పచ్చిమిర్చి - 4
దాల్చిన చెక్క - కొద్దిగా
లవంగాలు - 8
నెయ్యి - 1 టేబుల్ స్పూన్
ఉప్పు - తగినంత
యాలకులు - 4
ఎండుమిర్చి - 2
జీలకర్ర - అర టీ స్పూన్
కరివేపాకు - 3 రెబ్బలు
నీళ్లు - 4 కప్పులు
మినపప్పు - 1 టీ స్పూన్
శనగపప్పు - 1 టేబుల్ స్పూన్

తయారు చేసే విధానం

బియ్యాన్ని కడిగి నానబెట్టాలి. పాత్రలో నెయ్యి వేడి చేసి జీలకర్ర, మినపప్పు, శనగపప్పు వేయించాలి. అందులోనే పచ్చిమిర్చి ముక్కలు, ఎండుమిర్చి, దాల్చిన చెక్క, లవంగాలు వేసి రెండు నిమిషాలు వేయించాలి. తర్వాత బంగాళదుంప ముక్కలు, వడగట్టిన బియ్యం కూడా వేసి రెండు నిమిషాలు కలియదిప్పాలి. కొబ్బరి తురుము, కరివేపాకు, ఉప్పు, నీళ్లు పోసి కలపాలి. మూత పెట్టి సన్న సెగమీద 20 నిమిషాలు ఉడికిస్తే కొబ్బరి ఆలూ రైస్ రెడీ.



పెసర లడ్డూలు

కావలసిన పదార్థాలు

ఛాయపెసరపప్పు - 1 కేజీ
పంచదార - 1 కేజీ
నెయ్యి - 400 గ్రాములు
జీడిపప్పు - 50 గ్రాములు
యాలకులు - 6, నీళ్లు - తగినన్ని
పచ్చకర్పూరం - చిటికెడు



తయారు చేసే విధానం

పెసరపప్పు వేయించి మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసి పెట్టుకోవాలి. పంచదారలో సరిపడా నీళ్లు పోసి తీగపాకం వచ్చేవరకు ఉడికించాలి. అందులో పచ్చకర్పూరం, యాలకుల పొడి వేసి కలపాలి. ఆ తర్వాత పెసరపొడి, కొద్దికొద్దిగా నెయ్యి వేస్తూ బాగా కలిపి దించాలి.అందులోనే నేతిలో వేయించిన జీడిపప్పు పలుకులు కలపాలి. గోరు వెచ్చగా ఉన్నప్పుడే ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి. ఇవి ఒక రోజు తర్వాత తింటే చాలా రుచిగా ఉంటాయి. ★

జొంపాలంక

ఇది చూడ్డానికి పావురంలా కనిపిస్తుంది. కానీ దానికంటే చిన్నది. చాలా బలంగా ఉండి, వేగంగా ఎగురుతుంది. శరీరం పైభాగం పసుపు కలిసిన లేత ఎరుపు రంగులో, పొట్ట గోధుమ రంగు కలిసిన నలుపు రంగులో వుంటుంది. దీని మెడ కింద ఉదరభాగాన అడ్డంగా నల్లని పట్టీ వుంటుంది. తోక, రెక్కలు మొనదేలి, ఎగిరేటప్పుడైతే స్పష్టంగా కనిపిస్తాయి. దీనికి మరో ప్రత్యేక లక్షణం కూడా ఉంది. అదేంటంటే రెండు రకాలుగా అరుస్తుంది. ఎంత బిగ్గరగా అరుస్తుందంటే, కనుచూపు మేరలో అదెక్కడా కనిపించదు. కానీ దాని అరుపు వినిపిస్తుంది. ఇదెప్పుడూ ఒంటరిగా తిరగదు. పది, పదిహేను పక్షులు కలిసి గుంపుగా సేద్యం చేయని భూముల్లో తిరుగుతుంటాయి. నీటిని తాగడానికి నిర్ణీత సమయాల్లోనే చెరువు దగ్గరికి వెళ్తాయి. ఆహారంగా గడ్డి విత్తనాలు, ధాన్యం గింజలతో పాటు ఇసుకని కూడా మింగేస్తాయి. మరో విషయమేంటంటే మామూలు నేలమీదే గుడ్లను పెడతాయి. ఇవి పాలిపోయిన ఊదారంగులో ఉంటాయి. గుడ్లు పొదగగానే వచ్చే పిల్లల శరీరం మీద రక్షణగా సన్నటి నూగు ఉంటుంది. అంతే కాదు గుడ్లనుండి బయటికి రాగానే ఇవి పరిగెత్తగలవు కూడా. తండ్రి పక్షి నీళ్లు తాగడానికి వెళ్లినప్పుడు రెక్కలను తడుపుకొస్తుంది. ఆ నీళ్లనే పిల్లలకు తాపుతుంది.



వెనక్కి ఎందుకు?

ఆగివున్న రైలును ముందుకు తీసుకెళ్లడానికి ఇంజను డ్రైవరు ఒకోసారి రైలును వెనక్కి జరుపుతాడు. ఎందుకు?



జవాబు: రైలు స్టేషన్ లోపలికి వచ్చి ఆగినప్పుడు కప్లింగ్ గొలుసులు లాగినట్లు బిగుతుగా ఉంటాయి. అలాంటప్పుడు ఇంజను రైలును ముందుకు లాగాలంటే మొత్తం రైలును ఒక్కసారే కదపాల్సొస్తుంది. ఇది చాలా కష్టం. ఒకసారి రైలును వెనక్కి జరిపితే ఆ గొలుసులు వదులవుతాయి. అప్పుడు ఇంజను ముందుకు కదిలితే ఒక బోగీ తర్వాత మరొక బోగీ కదలుతాయి. ఇలా రైలుని కదపడం తేలికవుతుంది.

అదిరె... అదిరె...



ఎవరున్నారు?

బుజ్జాయిలూ... కింద బొమ్మలో ఎవరున్నారు? పెద్ద మీసాలు, గడ్డంతో ఓ తాత కనిపిస్తున్నాడు కదా. కానీ కొంచెం జాగ్రత్తగా పరిశీలించండి. ఎవరున్నారో చెప్పండి.



నేస్తాలూ... వేలి ముద్రతో చేసిన ఈ గబ్బిలం బొమ్మ బాగుంది కదా. మీరూ ఇలా చేసి చూడండి! ఇదే ఇలాంటి మరెన్నో బొమ్మలు ప్రయత్నించాలి.



ఏది ఎక్కడ?

ఫ్రెండ్స్... ఇక్కడో జంతువు ఆకారం ఉంది. పక్కనే దానికి సంబంధించిన విడి భాగాలు ఉన్నాయి. మీరేం చేయాలంటే... వాటిని ఎలా అమరిస్తే కరెక్టుగా దాని ఆకారం వస్తుందో చూసి పెట్టేసెయ్యండి.



కవలలు ఏవి?

హాయ్.. ఇక్కడ ఆరు చేపలున్నాయి! అవన్నీ చూడ్డానికి ఒకేలా ఉన్నాయి. కానీ వాటిలో రెండు మాత్రమే కవలలు. అవేంటో చెప్పకోండి చూద్దాం.

హ్హా...హ్హా...

పేర్లు

ఓ వ్యక్తి : బాబూ నీ పేరేంటి.

బాబు : నా పేరు ప్రకాష్.

వ్యక్తి : మీ నాన్నపేరు చెప్పు?

బాబు : సూర్యం.

వ్యక్తి : మీ ఇద్దరి పేర్లు ఇంగ్లీషులో చెప్పు.

బాబు : మై నేమీజ్ సన్‌లైట్. మై ఫాదర్ నేమీజ్ సన్.

రింగ్‌టోన్

రాజారావ్: ఏంట్రా...నేను ఎప్పుడు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ అని వస్తోంది?

రాఘవరావ్: ఓ...అదా... అది నా రింగ్ టోన్.

రాజారావ్: అలాంటి రింగ్‌టోన్లు కూడా వున్నాయా?

నాన్నకు చెబితే...

మాస్టారు :ఏరా ప్రకాష్! మూడులో నుండి ఆరు తీయగలమా?

ప్రకాష్: ఎందుకు తీయలేం సార్! మా నాన్నతో చెబితే ఎవర్నైనా పంపించి బలవంతంగా ఎన్నైనా సరే తీయిస్తాడు.

రంగులు నింపేద్దాం

చిన్నారులూ... కింది బొమ్మ చక్కగా ఉంది కదూ. దీనికి ఏరంగులు వేస్తే ఇంకా బావుంటుందో చూసి చకచకా వేసేయండి.

మాటల కోట - 70

రూపకల్పన : కర్లపాలెం

1		2		3				4
		5						
				6				
7								
				8				9
10	11							
			12			13		
14					15			
		16			17			

అడ్డం :

1. గాలి జనార్ధన రెడ్డి ప్రజాప్రతినిధిగా ఎన్నికైన నియోజక వర్గం (3)
3. ఓటుకు నోటు కుంభకోణంలో జైలుకు పోయిన సింగ్ (5)
5. వైఎస్ జగన్ ఆదాయానికి సంబంధించిన కేసులను విచారించేది ఈ సిబిఐ నారాయణే (2)
6. కర్నాటక లోకాయుక్త దెబ్బకు ముఖ్యమంత్రి పదవి పోగొట్టుకున్న భాజపా నేత (4)
8. పార్లమెంటులో నోట్ల కట్టలు కనిపించిన కుంభకోణం... తిరగేసి (5)
10. మధ్యలో దీర్ఘం తీసిన పవర్... అటునుంచీ (3)
13. విదేశీమార్గంలోనుండి సొమ్మును తరలించే కుంభకోణం (3)
14. నేరం రుజువు కాగానే ఉద్యోగి మీద ముందు పడేది సస్పెన్షన్.... (2)
15. టూజీ కుంభకోణానికి ముందు రాజులా పెత్తనం చలాయించిన డిఎంకె మాజీ మంత్రి (2)
16. అవినీతి నిరోధక శాఖ వినిపించేది ప్రభుత్వ ....నే అని అంటుంటారు (2)
17. వాన్‌పిక్ లోని రెండు ప్రాంతాల్లో ఒకటి నిజాంపట్నం. రెండోది చివరిసగం తిరగబడింది (2)

నిలువు :

1. నేరం చేసి శిక్షకు గురయిన ప్రతివాడూ తాను అన్యాయంగా ... అయ్యాననే అంటాడు (2)
2. కాగ్ తాజాగా వాతపెట్టిన చమురు కంపెనీ (4)
4. కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ శాఖ సంక్షిప్తంగా తిరగబడింది (2)
6. ఏ నేతా సాధారణంగా సహించలేనిది అనుభవించే పదవి నుండి.... (4)
7. ఆంధ్రప్రదేశ్‌ని అల్లాడిస్తున్న విల్లాల కుంభకోణం ఈ కంపెనీదే (3)
9. గాలి సోదరులకు ఇనుప గనులున్నది ఆంధ్రప్రదేశ్‌లోని ఈ పురంలోనే (5)
11. సోదాలకు వెళ్లాలంటే సిబిఐకైనా కోర్టువారిచ్చే ఇది అవసరం (3)
12. కడపలో గాలి సోదరులు పెడతామన్న ఉక్కు ఫ్యాక్టరీ పేరు (3)
13. లోక్‌పాల్ అనగానే గుర్తొచ్చే పేరు! (3)
14. టూజీ కుంభకోణమంతా ఈ పాటలో జరిగిన గోల్‌మాలే (2)
15. ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం జగన్ కేసులో సుమోటోగా స్వీకరించింది ఈ శంకర... రాసిన ఉత్తరాన్నే (2)

మాటలకోట - 69 జవాబు

1 వి	2 జ	య	3 ద	శ	4 మి		5 మీ	6 నా
	గ్గ		యా		రి			తి
	య్య		కు		7 యా	డు	8 కు	చ
9 రం	గా		వు		లు		10 లా	రా
11 గ	రు	12 కు				13 ఆ	సా	మి
నా		14 కం	15 ణం	16 క		వా		
17 య	18 మ		19 కి	న్నె	20 ర	లు		21 త
22 క	ల	23 గూ	ర	గం	ప		24 కో	లా
మ్మ		డు		టి		25 ఓం	పు	రి

హ్హ... హ్హ...

రెండు పుస్తకాలు

హరి: ఏంరా! ఒకే పుస్తకం రెండు కాపీలు కొన్నావెందుకు?

గిరి: ఈ పుస్తకం చేతిలో వుంటే సగం పరీక్షలు పాసైనట్టే అని రాసి వుంది. అందుకే రెండు కొనేశాను. మొత్తం పాసవ్వచ్చుకదా.

వేలు

ఆఫీసర్: సిగ్గులేదటయ్యా! కూరలు తరుగుతుంటే వేలు తెగినందుకు సెలవు అడుగుతున్నావ్?

ఉద్యోగి: నిజం సార్. కూరలు తరుగుతుంటేనే తెగింది. కావాలంటే చూడండి.

ఆఫీసర్: నేను నమ్మను. ఎందుకంటే నేను గత పాతిక సంవత్సరాలుగా కూరలు తరుగుతున్నాను. కానీ ఎప్పుడూ వేలు కాదు కదా గోరు కూడా తెగలేదే నాకు!

స్నేహ, హైదరాబాద్.

పిల్లి మెడలో గంట

పూర్వం ఓ షావుకారు వుండేవాడు. అతనికి చాలా పెద్ద కిరాణా కొట్టు వుండేది. 'అది వుంది... ఇది లేదు' అని పేరెట్టడానికి లేకుండా అందులో అన్నీ లభించేవి. దాంతో ఆ ఊరి వారంతా అక్కడికే వచ్చి సరకులు తీసుకెళ్లేవారు. దాంతో షావుకారుకు మాంచి లాభాలు వస్తుండేవి. ఎంత షావుకారైనా అతనికీ ఓ సమస్య వుంది. దాన్ని పరిష్కరించుకోవడం ఎలాగో తెలీక ఎప్పుడూ బాధపడేవాడు.

విషయం తెలీనివాళ్లు 'అతనికి సమస్యలేం వుంటాయి?!' అని ఆశ్చర్యపోయేవారు. కానీ అంతా విన్నాక 'నిజమే సుమా. ఎవరి బాధలు వారివి. ఏం చేస్తాం?' అని నిట్టూర్చేవారు.

షావుకారుకు పెద్ద దుకాణం వుందనుకున్నాం కదా. దాన్నిండా బోలెడన్ని తినుబండారాలు కూడా వుండేవి. వాటికోసం ఎలుకలు వచ్చి చేరతాయి. బియ్యం, కందిపప్పు, బిస్కట్లు, కూరగాయలు....ఏవీ వదిలేవి కావు. అన్నిటినీ కడుపునిండా తిని పిల్లాపాపలతో హాయిగా వుండేవి. ఎలుకల వైపు నుంచి చూస్తే ఇదంతా బానే వుంది. కానీ షావుకారు సంగతో! ఎలుకలు తినేది తక్కువే అయినా ఆగం చేసేది ఎక్కువ. పైగా తిన్న తర్వాత ఊరకే వుంటాయా! విసర్జిస్తాయి. దాంతో దుకాణం అంతా ఆగం అయిపోయేది. ఇదంతా తెలిసి కూడా జనం జర్దుకుపోయేవారు. కానీ ఎంతకాలం భరిస్తారు? తర్వాత్తర్వాత ఎలుకలను తరిమేస్తే తప్ప కొట్టుకు రామని చెప్పేస్తారు.

అందుకే అతను బాగా ఆలోచించి ఆలోచించి ఒక పిల్లిని తీసుకొస్తాడు. తెల్లగా భలే ముద్దుగా వుండేది. దానికి తెలివితేటలు కూడా కొంచెం ఎక్కువే. ఎప్పుడు చూసినా చలాకీగా వుండేది. ఎటు వెళ్లినా ఎలుక కనిపించేది. పట్టి తినేసేది. పిల్లి పని బానే వుంది కానీ ఎలుకలకే చావొచ్చిపడుతుంది. కలుగుల్లోంచి బయటకు రావడానికి లేకపోయె. ఎంతకాలమని లోపలే వుంటాయి? ఆకలి వేస్తుందికదా. కొంచెం పెద్ద ఎలుకలు ఎలాగోలా ఆకలిని తట్టుకున్నా బుజ్జి ఎలుకలకు మాత్రం మహా కష్టంగా వుండేది. బయటికెళ్లి ఏదో ఒకటి తిని వస్తామని గోల పెట్టేవి. 'అయ్యో! లోపల వుంటే కనీసం ప్రాణాలైనా దక్కుతాయి. బయటికెళితే తిండి దొరికినా ప్రాణాలు పోతాయి' అని వాటిని కట్టడి చేసేవి పెద్ద ఎలుకలు. అప్పటి వరకు ఆకలి ఎరగని ఎలుకలకు ఖాళీ కడుపుతో వుండడం కష్టమే అవుతుంది. అన్నీ కలసి ఒక సమావేశం వేసుకుంటాయి. దానికి ఒక ఎలుక నాయకత్వం వహిస్తుంది.

"మిత్రులారా! మొన్నటి దాకా షావుకారు కిరాణా కొట్టు స్వర్గమనుకున్నాం. ఆ మాయదారి పిల్లి వచ్చిన దగ్గరనుంచి నరకంలా తయారైంది. ఈ నరకంలో అది యముడిలా వుంది. ఇప్పుడా యముడి లాంటి పిల్లి సమస్యను వదిలించుకోవాలి. మనం ఇంతమందిమి వున్నాం కాబట్టి. ... ఒక్కొక్కరం ఒక్కో ఉపాయం ఆలోచించినా అందులో ఏ ఒక్కటి పని చేసినా పిల్లి గోల వదులుతుంది. ఒక్కొక్కరు బాగా ఆలోచించి ఉపాయం చెప్పండి" అంటుంది.

దానికి ఓ ముసలి ఎలుక లేచి..."నిజమే! ఈ కిరాణాకొట్టుకు వచ్చిన ముందుతరం ఎలుకల్లో నేను ఒక్కదాన్నే మిగిలాను. మిగతావన్నీ వయసైపోయి చనిపోయాయి కానీ ఇలా ఆకలితో ఏనాడూ మాడలేదు. ఇప్పుడు చూస్తే చిన్న చిన్న ఎలుకలు కూడా ఆకలితో మాడి చనిపోయేలాగున్నాయి. ఏదైనా చెబుదామా అంటే బుర్ర చురుగ్గా పనిచేయడం లేదు. కుర్ర ఎలుకలున్నాయిగా. అవే లేచి పిల్లిని కట్టడి చేసే సలహాలివ్వాలి" అంటూ కూర్చుంటుంది.

అన్ని ఎలుకలూ తలా ఒక సలహా ఇస్తాయి. కానీ ఏదీ పిల్లిని కట్టడి చేసేలా వుండదు. దాంతో సమావేశానికి నాయకత్వం వహిస్తున్న ఎలుక చాలా నిరుత్సాహపడుతుంది. "ఏవర్రా! అందరూ చెప్పేశారా! ఇంకా ఎవరైనా మిగిలారా!' అంటుంది ఆశగా. అప్పుడు ఒక మూల నుంచి... "నేనున్నాను" అన్న మాట కీచుగొంతుతో వినపడుతుంది.

"ఎవరది? లేవండి. లేచి చెప్పండి" అంటుంది ఎలుక.

"నేను లేచి నిలబడలేను. నాకంత ఓపిక లేదు. కూర్చునే చెప్తాను" అంటూ...'మీరందరూ అన్నది నిజమే. పిల్లి మనందరి సమస్య. చప్పుడు కాకుండా వచ్చి చటుక్కున మన వాళ్లను పొట్టన పెట్టుకుంటోంది. దానికి ఏదైనా పరిష్కారం ఆలోచించాలి..." అంటుండగానే...

"అదే కదా...నువ్వు చెప్పాల్సింది" అంటుందో ఎలుక.

"అక్కడికే వస్తున్నాను మిత్రులారా! పిల్లి మెడలో గంట ఒకటి కడితే సరిపోతుంది. అది కాలు కదల్చగానే మనందరికీ తెల్సిపోతుంది. మనం ఎక్కడివారం అక్కడ దాక్కోవచ్చు. ఇంక అది మనల్ని తినే అవకాశమే వుండదు" అంటుంది తెలివిగా.

దానికి ఎలుకలన్నీ ఎంతో సంతోషిస్తాయి. అంతలోనే అన్నీ నీరసపడిపోయి..."అంత వరకు బానేవుందిగానీ...పిల్లి మెడలో గంట కట్టేదెవరు?!' అంటాయి ఏక కంఠంతో.

ఎంతకీ ఎవ్వరూ మాట్లాడకపోయేసరికి సమావేశానికి నాయకత్వం వహించిన ఎలుక కలుగచేసుకొని 'అందరూ మీ మీ కలుగుల్లోకి వెళ్లి బాగా ఆలోచించండి. ఏదైనా పరిష్కారం లభిస్తే చెప్పండి. ఇంతటితో సమావేశం ముగిసింది' అంటూ వేదిక మీద నుంచి కిందకి దిగుతుంది.

ఎలుకలన్నీ నీరసంగా కలుగుల్లోకి వెళ్లిపోతాయి పిల్లి సంగతి ఆలోచించడానికి.

-కె. సాహిల్

కండల వీరుడు రోమియో



కొండ మిరపకాయ ఎంతుంటుంది?! పై నుంచి కిందికి ఎన్ని సార్లు కొల్చినా అంగుళం కంటే తక్కువేగానీ ఎక్కువ కాదు. కానీ కొరికి చూస్తే...కారం నసాళానికి అంటాల్సిందే. దాన్నిబట్టి ఏం చెప్పకోవచ్చు?! చిన్నగా వుందని చిన్నచూపు చూస్తే కారంతో కొడుతుందనేగా. ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న చిన్నోడు కూడా అంతేనండోయ్! చూడ్డానికి జానాబెత్తెడుగా వున్నా మాంచి బాడీ బిల్డర్. నమ్మబుద్ధి కావడంలేదా? కొన్ని అంతేనండీ కంటితో చూసినా కాదనిపిస్తుంది. మనోడి పేరు ఆదిత్య 'రోమియో' దేవ్. పంజాబ్ వాసి. కండలు ఎలా ప్రదర్శిస్తున్నాడో చూడండి. అతగాడి ఎత్తు 2 అడుగుల 9 అంగుళాలు. బరువు 9 కేజీలు. వయసు మాత్రం 22 సంవత్సరాలు. జన్యుపరమైన లోపం వల్ల ఇలా చిన్నగానే వుండిపోయాడు. పొడవు పెరగలేదు. అలాగని రోమియో ఏమాత్రం దిగులుపడలా. చక్కగా శిక్షణ తీసుకుని కండల వీరుడిగా తయారయ్యాడు. తన బరువు తొమ్మిది కేజీలే అయినా 1.5 కేజీల డంబెల్స్ ఎత్తుతాడు. చక్కగా డాన్స్ చేస్తాడు. అతగాడి కోరిక ఏంటయ్యా అంటే వీలైనంత మేర ప్రపంచం చుట్టిరావాలనుందంట.